



ప్రధాని సభకు చకచకా ఏర్పాట్లు

- పరుగులు తీస్తున్న అధికారులు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వరుస సమావేశాలు
- మూడు లక్షల మందిని సమీకరించాలని లక్ష్యం
- జనాల తరలింపునకు ఏడు వేల వాహనాలు
- రెండు పూటలకూ కలిపి మూడు లక్షల ఆహార పొట్లాలు సిద్ధం



సభా ప్రాంగణం మధ్య నుంచి వేదిక వరకూ తారురోడ్డు నిర్మాణం

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల ఎనిమిదో తేదీన జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా అధికారులు ముమ్మరం చేశారు. ప్రధాని రాకకు మరికొద్ది గంటలు మాత్రమే సమయం ఉన్నందున పరుగులు తీస్తున్నారు.

ప్రధాని పర్యటన నేపథ్యంలో మంత్రులు, కూటమి నేతలు నగరానికి చేరుకుంటున్నారు. మంత్రి లోకేశ్ ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేయగా సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్, ఇతర ప్రముఖులు సమావేశమయ్యారు. జనసేనకు చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్ అనకాపల్లిలో సమీక్ష నిర్వహించిన అనంతరం నగరానికి చేరుకుని కేడర్‌తో సమావేశమై జన సమీకరణపై సమీక్షించారు. ప్రధాని సభకు మూడు లక్షల మందిని సమీకరించాలని లోకేశ్ ఆదేశించడంతో అందుకు తగినట్టుగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సిద్ధమవుతున్నారు. బహిరంగ సభలో రెండు లక్షలు, రోడ్‌షోలో మరో లక్ష మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజక వర్గాల వారీగా జన సమీకరణపై దృష్టిసారించారు. జనాలను తరలించేందుకు ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, వ్యాన్‌లు, కార్లు కలిసి సుమారు ... మిగతా 6వ పేజీలో



రైల్వే న్యూకాలనీ జంక్షన్ వద్ద విద్యుద్దీపాలంకరణ

4,000 మందితో బందోబస్తు

పర్యవేక్షణకు 35 మంది ఐపీఎస్‌లు

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు నాలుగు వేల మందితో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్టు నగర పోలీస్ అధికారులు తెలిపారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందుజాగ్రత్తగా రూట్, రోప్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, డామినేషన్ టీమ్‌లు, క్విక్ రియాక్షన్ టీమ్‌లను ఏర్పాటుచేస్తున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రధాని బయటకు వచ్చినప్పటి నుంచి రోడ్‌షో ప్రారంభమయ్యే వెంకటాద్రి వంటిల్లు వరకూ మార్గాన్ని ప్రత్యేక జోన్‌లుగా విభజించి ఐపీఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. అలాగే రోడ్‌షో, సభ పూర్తయిన తర్వాత తిరిగి రోడ్డు మార్గంలో ఎయిర్‌పోర్టుకు చేరుకునేంత వరకూ పటిష్ఠ భద్రత ఏర్పాటుచేస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 35 మంది ఐపీఎస్ అధికారులను ఇప్పటికే బందోబస్తు కోసం నగరానికి రప్పించారు. నగర పోలీస్ కమిషనరేట్‌లోని అధికారులు, సిబ్బందితో సహా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న నాలుగు వేల మందిని బందోబస్తు కోసం వినియోగిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి ఇప్పటికే కొందరు సిబ్బంది నగరానికి చేరుకోగా, మిగిలిన వారంతా మంగళవారం ఉదయానికి వస్తారని అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగా ప్రధాని నరేంద్రమోదీ సభ జరిగే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంతో పాటు ప్రధాని ప్రయాణించే మార్గాల్లో ఐదు కిలోమీటర్ల పరిధిలో డ్రోన్ కెమెరాలు ఉపయోగించరాదని సీపీ శంఖబ్రతబాగ్చి సోమవారం ప్రకటన జారీచేసారు. ఎవరైనా దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

2026 నుంచి విశాఖకు విమానాలు బంద్

భోగాపురం ఎయిర్‌పోర్టు జూన్ నాటికి ప్రారంభమైతే సెప్టెంబరు నుంచి ఇక్కడకు డొమెస్టిక్ విమానాల నిలిపివేత

రక్షణ అవసరాల కోసం పూర్తిగా స్వాధీనం చేసుకోనున్న నేవీ

ఫిబ్రవరి నుంచి రాత్రి 11 నుంచి ఉదయం 7 గంటల మధ్య రాకపోకలు నిషేధం



అధికారులు, కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం 2026 సెప్టెంబరు నుంచి మూతపడనున్నది. ప్రయాణికుల విమానాలను అనుమతించరు. దీనిని పూర్తిగా తూర్పు నౌకాదళమే రక్షణ అవసరాలకు ఉపయోగించుకుంటుంది. విశాఖ విమానాశ్రయం సలహా కమిటీ సోమవారం ఎంపీ ఎం.శ్రీభరత్ అధ్యక్షతన సమావేశమైంది. ఈ సందర్భంగా భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం 2026 జూన్‌లో ప్రారంభమైతే విశాఖ విమానాశ్రయం పరిస్థితి ఏమిటని పలువురు సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. దానిపై విశాఖ నేవీ వైమానిక స్థావరం వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న ఐఎన్ఎస్ డేగా అధికారులు, విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి స్పందించారు. అనుకున్న సమయానికి భోగాపురం ప్రారంభమైతే అదే ఏడాది సెప్టెంబరు నుంచి విశాఖ విమానాశ్రయం మూసేస్తామని స్పష్టంచేశారు.

మరో ఎనిమిది నెలలు అందుబాటులో ఉండని ఐఎల్ఎస్

విశాఖ విమానాశ్రయాన్ని నేవీ ఉపయోగించుకుంటున్న సంగతి తెలిసిందే. భవిష్యత్తు అవసరాల కోసం ప్రస్తుతం 10 వేల అడుగుల పొడవు ఉన్న రన్‌వేను నేవీ అధికారులు అటు వేయి అడుగులు, ఇటు 1,000 అడుగుల పొడవు పెంచే పనిలో ... మిగతా 6వ పేజీలో

దుబాయ్ విమానం పునరుద్ధరణపై దృష్టిపెట్టండి

- అధికారులకు ఎంపీ ఎం.శ్రీభరత్ ఆదేశం
- గోవా, పూణేలకు కూడా...
- అత్యధిక డిమాండ్ ఉన్న బెంగళూరు, ముంబై నగరాలకు సర్వీస్‌లు పెంచాలి

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి దుబాయ్‌కు విమాన సర్వీస్ పునరుద్ధరణపై దృష్టి పెట్టాలని విమానాశ్రయం సలహా కమిటీ అధ్యక్షులు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సూచించారు. సోమవారం ఆయన అధ్యక్షతన విమానాశ్రయంలో కొత్త కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో దుబాయ్, గోవా, పూణేలకు విమానాలు ఉండేవని, ప్రస్తుతం అవి లేవని పునరుద్ధరించాలని కోరారు. దీనిపై ఎంపీ ప్రశ్నించగా ఆయా సంస్థలకు విమానాల ... మిగతా 6వ పేజీలో

మళ్లీ వైరస్ టెన్షన్

దేశంలో మూడు హెచ్ఎంపీవీ కేసులు నమోదు కావడంతో కేంద్రం అలర్ట్

- సీఎం టెలీ కాన్ఫరెన్స్
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఆదేశాలు
- కేజీహెచ్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు



విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ పుట్టిన చైనా నుంచి మరో మహమ్మారి వ్యాప్తి చెందుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గడిచిన కొద్దిరోజులుగా చైనాలో హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) వ్యాప్తి చెందుతోంది. మన దేశంలో కూడా సోమవారం మూడు కేసులు నమోదు కావడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం సాయంత్రం ఆరోగ్య శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ క్రమంలో కేజీహెచ్‌లో 20 పడకలతో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసుకోవాలని అధికారులకు సమాచారం అందింది. క్యాజువాలిటీపైన మొదటి అంతస్థులో 20 పడకలతో వార్డును సిద్ధం చేస్తున్నట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఇవీ లక్షణాలు

ఈ వైరస్ సోకిన వారిలో దగ్గు, జలుబు, జ్వరం, ఆయాసం, దురద వంటి లక్షణాలు ఉంటాయి. ఐదేళ్లలోపు చిన్నారులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులు, హెచ్ఐవీ, కేన్సర్, కీళ్లవాతం వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారికి, స్టెరాయిడ్స్ వినియోగించే వారికి వైరస్ సోకే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. తుంపర్ల ద్వారా వైరస్ సోకిన వ్యక్తి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే చాలామందిలో సాధారణ ... మిగతా 6వ పేజీలో

ఉక్కు కార్మికుల ఆందోళన

- రహదారిపై బైఠాయింపు...బైక్ ర్యాలీ
- కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామంటూ ప్రధాని విశాఖ పర్యటనలో ప్రకటించాలని డిమాండ్



విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని లేదా సెయిల్‌లో విలీనం చేసి పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడుపుతామని ఎనిమిదో తేదీన విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. - మెయిన్ 3లో

జిల్లా ఓటర్లు 20,15,934

- పురుషులు 9,94,365, మహిళలు 10,21,450
- ముసాయిదా జాబితాతో పోల్చితే 1,968 మంది పెరుగుదల



విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 అనంతరం తుది ఓటర్ల జాబితా సోమవారం విడుదల చేశారు. దీని ప్రకారం జిల్లాలో మొత్తం 20,15,934 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 9,94,365, మహిళలు 10,21,450, ట్రాన్స్ జండర్లు 119 మంది ఉన్నారు. పురుషులలో పోల్చితే మహిళలు 27,085 మంది ఎక్కువగా ఉన్నారు.

గత సంవత్సరం అక్టోబరు 29న విడుదల చేసిన ముసాయిదా జాబితాతో పోల్చితే జిల్లాలో 1,968 మంది ఓటర్లు పెరిగారు. ముసాయిదా జాబితా విడుదల తరువాత కొత్తగా 2,455 మంది పురుషులు, 2,657 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జండర్లు...మొత్తం 5,114 మందిని కొత్తగా జాబితాలో చేర్చగా, మరణించడం, డబుల్ ఎంట్రీ, వలసపోవడం వంటి వాటికి సంబంధించి 3,416 మంది ఓట్లు జాబితా నుంచి తొలగించినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఇక, గత ఏడాది అక్టోబరు 29న జాబితా విడుదల చేసే నాటికి జిల్లాలో 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన ... మిగతా 6వ పేజీలో

తుది జాబితా మేరకు జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ట్రాన్స్ జండర్లు	మొత్తం
భీమిలి	361	1,78,834	1,85,744	15	3,64,593
విశాఖ తూర్పు	282	1,42,567	1,49,734	20	2,92,326
విశాఖ దక్షిణ	236	1,06,743	1,10,633	33	2,17,409
విశాఖ ఉత్తర	272	1,40,506	1,44,696	22	2,85,224
విశాఖ పశ్చిమ	221	1,05,279	1,08,423	12	2,13,714
గాజువాక	309	1,67,377	1,66,766	12	3,34,155
పెందుర్తి	299	1,53,059	1,55,449	5	3,08,513
మొత్తం	1,980	9,94365	10,21,450	119	20,15,934



రోడ్డు పక్క బండి వద్ద టిఫిన్ చేస్తున్న మంత్రి సత్యకుమార్, ఇతర బీజేపీ నాయకులు

రోడ్డుపక్కన మంత్రి సత్యకుమార్ టిఫిన్

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చాలా సాదాసీదాగా ఉంటారు. హంగు, ఆర్భాటాలకు దూరంగా ఉండేందుకు యత్నిస్తారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విశాఖ విచ్చేసిన ఆయన సోమవారం ఉదయం గురుద్వార జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కనున్న బండి వద్ద సాధారణ పౌరులతో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా పలువురితో సరదాగా మాట్లాడారు. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులు ఉన్నారు.

ఐటీ కంపెనీలను జగనే తెచ్చారట!

- టీసీఎస్, గూగుల్ ఆయన ఘనతేనట
- మాజీ మంత్రి అమర్ అడ్డగోలు వాదన
- భోగాపురం విమానాశ్రయం కూడా వారి చలవేనట
- రుషికొండ ప్యాలెస్ ప్రధాని, రాష్ట్రపతిలకు ఇవ్వాలట



విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అడ్డగోలు వాదన వినిపిస్తున్నారు. ఆయన ఐటీ మంత్రిగా పనిచేసిన హయాంలో ఒక్కటంటే ఒక్క పెద్ద ఐటీ కంపెనీని కూడా తీసుకురాలేకపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో టీసీఎస్, గూగుల్ వంటి సంస్థలు విశాఖపట్నం వస్తుంటే...అవి తమ ఘనతేనని చెప్పుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఇన్ఫోసిస్ మాత్రమే వచ్చింది. అది కూడా ఆ పార్టీ నాయకుల ప్రోత్సాహం వల్ల కానే కాదు. వారికి విశాఖలో ఒక కార్యాలయం ఏర్పాటుచేయాలనే ఆలోచన కలిగి సొంతంగా రాజకీయ ప్రమేయం లేకుండానే పెట్టుకున్నారు. దానిని తామే తీసుకువచ్చినట్టు వైసీపీ ప్రచారం చేసుకుంది. ఇకపోతే రాష్ట్రంలో ఐటీకి సరైన ప్రోత్సాహకాలు లేవని వైసీపీ ప్రభుత్వ హయాంలోనే సిరిపురంలోని హెచ్ఎస్‌బీసీ బిచాణా ఎత్తేసింది. సిటీ సెంట్రల్ పార్కు ఎదురుగా నడిచే డబ్ల్యుఎన్ఎస్ సంస్థ తన కార్యాలయాన్ని హెచ్ఎస్‌బీసీ భవనంలోకి మార్చుకుంది. దానిని వక్రీకరించి డబ్ల్యుఎన్ఎస్ అనేది కొత్త సంస్థ అన్నట్టు, దానిని వైసీపీయే తెచ్చినట్టు అమర్ సోమవారం ... మిగతా 6వ పేజీలో



తుప్పల మధ్య ఉన్న కారు

నిరుపయోగంగా బ్యాటరీ కారు

సింహాచలం, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే దివ్యాంగులు, గర్భిణీలు, వృద్ధుల సౌకర్యార్థం ఆంధ్రా బ్యాంక్ సింహాచలం శాఖ సీఎస్ఆర్ నిధులతో దేవస్థానానికి బ్యాటరీ కారు బహూకరించింది.కొన్ని నెలలకే ఇది మూలకు చేరింది. తొలుత టైర్లు తరువాత ఇంజనులో కొద్దిపాటి మరమ్మతుకు గురవ్వడంతో నిరుపయోగంగా పడేశారు. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ప్రస్తుతం ఇది పూర్తిగా పాడై, కృష్ణాపురంలోని దేవస్థానానికి చెందిన నృశింహవనంలో తుప్పల మధ్యన పడి ఉంది.కనీసం స్క్రాప్‌కు వేసేందుకు కూడా వీల్లేకుండా ఉంది. భక్తుల సౌకర్యార్థం మరో బ్యాటరీ కారు కొనుగోలు చేయడానికి దేవస్థానం అధికారులు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

వీల్‌చైర్లు వితరణ

తగరపువలస, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో మూడు గ్రామాలకు చెందిన ముగ్గురు దివ్యాంగులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భార్య శారదమ్మ సోమవారం వీల్‌చైర్లు వితరణగా అందజేశారు. తగరపువలసలో జరిగిన కార్యక్రమంలో శారదామ్మ హెల్పింగ్ హేండ్స్ సంస్థ ఆధ్వర్యంలో సారికి అప్పయ్యమ్మ (రౌతులపాలెం), నమ్మి బుచ్చిబాబు (వెంకటాపురం), అముజూరి ముత్యాలమ్మ (పాండ్రంగి)కు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వై. జీవన్‌కుమార్, శ్రీనివాస సేవా సంఘానికి చెందిన కె. సన్యాసినాయుడు, పి. ఇంద్రరావు, పైడిరాజు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.





పరిశ్రమల నుండి వస్తున్న కాలుష్యం దృశ్యాలు

కాలుష్యం కోరల్లో వెల్లంకి

- పంచాయతీ చుట్టూ 20 పరిశ్రమలు ఏర్పాటు
- నిత్యం దుమ్ము, దూళితో రోగాలు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- మూడు గ్రామాల ప్రజలకు అవస్థలు

ఆనందపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంకి పంచాయతీ కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. పంచాయతీ చుట్టూ పరిశ్రమలు నెలకొల్పడంతో ఆ ప్రాంతమంతా నిత్యం దుమ్ము, దూళితో నిండిపోతోంది. నివాసాలకు ఆనుకుని పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి, పొగ వల్ల ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వెల్లంకి పంచాయతీతో పాటు పరిధిలోని బొడ్డపాలెం, గారిపేట, వెల్లంకి-2 ప్రాంతాల్లో ప్లైవుడ్, ఐరన్, ప్లాస్టిక్, సీఫుడ్స్ వంటి పరిశ్రమలు సుమారు 20 వరకు ఉన్నాయి. ఆయా గ్రామాలు అటు జాతీయ రహదారికి ఇటు భీమిలికి వెళ్లే మార్గానికి ఆనుకొని ఉండడంతో పరిశ్రమలను ఆనుకునే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆలయాలు ఉన్నాయి. పరిశ్రమల నుంచి వస్తున్న దట్టమైన పొగ గ్రామాలను కమ్మేస్తోంది. కాలుష్యం ఎక్కువగా ఉండడంతో స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా.. ఎవరూ వెళ్లడం లేదు. పాఠశాల విద్యార్థులు కాలుష్యం బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడే సమయంలో కొంత మెరుగ్గా ఉన్నా.. వేసవిలో మాత్రం పరిసరాలు దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో నివాసానికి ఎంతో ఆసక్తి చూపే ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తిరువీధిలో ఊరేగుతున్న స్వామివారు

వైభవంగా పగల్ పత్ తిరువీధి

సింహాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై పగల్‌పత్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి సోమవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో పలు పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది బంగారు తొళ్ళక్కియాన్‌లో అధిష్ఠింపజేశారు. ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్ఛారణలు నడమ బేడా మండపంలో తిరువీధి జరిపారు. భక్తుల హరినామ స్మరణతో ఆలయం మార్మోగింది. తరువాత ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై స్వామివారు, అమ్మవార్లను అధిష్ఠింపజేసి స్థానాచార్యులు రాజగోపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని పాశురాలను విన్నవించారు.

జాతీయ రహదారిపై రెండు జింకలు మృతి



మారికవలస హైవేపై మృతి చెందిన జింక

ఎండాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనాలు ఢీకొని రెండు జింకలు మృతి చెందాయి. సోమవారం వేకువజామున మూడు గంటలకు జూపార్కు ప్రాంతంలో, ఉదయం ఐదు గంటలకు మారికవలస వద్ద ఈ సంఘటనలు జరిగాయి. అక్కడి చేరుకున్న అటవీశాఖాధికారులు జింకలను పరిశీలించారు. వాటికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగడంతో సీసీ టీవీ ఫుటేజ్‌ని పరిశీలించనున్నారు. తరచూ జింకలు వస్తుండడంతో 'జనారణ్యంలోకి వన్య ప్రాణులు' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలోనైనా అధికారులు చర్యలు తీసుకుని, వన్యప్రాణులు రహదారులపైకి రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

2026 నుంచి విశాఖకు విమానాలు బంద్

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. ఇవి మార్చితో పూర్తవుతాయని భావించారు. కానీ మట్టి స్వభావం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయి. ఆగస్టుకు కాని పూర్తికావని చెబుతున్నారు. ఈ పనులు జరుగుతున్నపుడు విమానాలు దిగడం కోసం ఉపయోగించే 'ఇనుస్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్(ఐఎల్ఎస్)'ను ఆపేస్తున్నారు. గత కొద్దికాలంగా రన్‌వే విస్తరణ పనులు జరుగుతుండడం వల్ల విమానాలతో ఐఎల్ఎస్ అనుసంధాన ప్రక్రియకు సాంకేతిక అవరోధాలు కలుగుతున్నాయి. రన్‌వే పనులు పూర్తయ్యేంత వరకు ఐఎల్ఎస్ సదుపాయం ఉండదని కూడా నేవీ అధికారులు ఈ సమావేశంలో స్పష్టం చేశారు. అదే విధంగా రన్‌వే పనులు త్వరితంగా పూర్తిచేయడానికి ఫిబ్రవరి నుంచి రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు విమానాల రాకపోకలను అనుమతించబోమని నేవీ అధికారులు వెల్లడించారు. విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ సర్వీసులు సింగపూర్, బ్యాంకాక్, కౌలాలంపూర్ నుంచి రాత్రి 11 గంటల తరువాతే వస్తున్నాయి. అవి రద్దు కాకుండా ఉండాలంటే... వాటి షెడ్యూళ్లు మార్చుకోవాలని, లేదంటే రాత్రి 12 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు రాకపోకలు నిలిపివేస్తామని నేవీ అధికారులు పేర్కొన్నారు.

స్లాట్లు 12 నుంచి 15కు పెంచడానికి అంగీకారం

విశాఖ విమానాశ్రయంలో రన్‌వేను ప్రస్తుతం అటు పౌర విమానాలకు, అటు నేవీ విమానాలకు ఉపయోగిస్తున్నారు. పౌర విమానాలకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు గంటకు 12 స్లాట్లు మాత్రమే ఇస్తున్నారు. అంటే ఆరు విమానాలు వచ్చి, తిరిగి వెళ్లగలుగుతున్నాయి. దీనివల్ల కొత్త విమానాలు రావడానికి అవకాశం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో విశాఖ ఎంపీ శ్రీభరత్ స్లాట్ల సంఖ్యను 18కి పెంచాలని నేవీ అధికారులను కోరారు. అన్ని ఇవ్వలేమని 15 వరకూ మాత్రమే ఇస్తామని హామీ ఇచ్చారు.

దుబాయ్ విమానం పునరుద్ధరణపై దృష్టిపెట్టండి

... 5వ పేజీ తరువాయి

కొరత వల్ల ఇక్కడి సర్వీస్‌లు రద్దు చేసుకున్నాయన్నారు. వారితో మాట్లాడి సర్వీస్‌లు పునరుద్ధరణకు ప్రయత్నిస్తామని అధికారులు చెప్పారు. అంతర్జాతీయ సరకు రవాణాకు ఇంకా అడ్డంకులు తొలగలేదని, ఆ సమస్య పరిష్కారానికి త్వరగా చర్యలు చేపట్టాలని ఎంపీ శ్రీభరత్ ఆదేశించారు. బెంగళూరు, ముంబై నగరాలకు నడుస్తున్న విమానాలకు అత్యధిక డిమాండ్ ఉన్నందున సర్వీస్‌లు పెంచాలని పలువురు సభ్యులు సూచించారు. పౌర విమానాలకు ఆటంకం కలగకుండా చూడాలని ఐఎన్ఎస్ డేగా అధికారులను కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు.

కొత్త కమిటీ ఏర్పాటు

విశాఖ విమానాశ్రయం సలహా కమిటీకి పలువురు సభ్యులను నామినేట్ చేసే అధికారం ఎంపీకి ఉంది. ఆ కోటాలో పలు రంగాలకు చెందిన వారిని శ్రీభరత్ నామినేట్ చేసి, నియామకపు పత్రాలు సమావేశంలోనే అందజేశారు. రెండేళ్ల పదవీ కాలం ముగిసిన వారిని కొందరిని కమిటీ నుంచి తప్పించారు. దసపల్లా హోటల్ సీఈఓ వెంకటకృష్ణ, సింబయోసిస్ టెక్నాలజీస్ సీఈఓ ఓ.నరేశ్‌కుమార్, ఐటీ సంస్థ ఫ్లూయెంట్ గ్రిడ్ ఛైర్మన్ గన్నమనేని మురళీకృష్ణ, షోర్ ఫ్రంట్ రిసార్ట్ అధినేత సంజన, సీవీ ఇన్‌ఫ్రా డైరెక్టర్ సీవీ ప్రద్యుమ్న, రాధిక గ్రూపు ఇండస్ట్రీస్ అధినేత మన్వేందర్ మోర్, రామబ్రహ్మం అండ్ సన్స్ ప్రతినిధి కంచర్ల రామ్‌ప్రసాద్‌లను నియమించారు. వీరు విమానాశ్రయం అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషిచేయాలని భరత్ సూచించారు. ఈ కమిటీలో ప్రత్యామ్నాయ ఛైర్మన్‌గా విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, సిటీ పోలీస్ కమిషనర్ నామినేటెడ్ సభ్యులుగా ఉన్నారు.

నేడు గంగమ్మ తల్లి పండగ

భీమునిపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల ఆరాధ్య దైవం గంగమ్మ తల్లి పండుగ మంగళవారం జరగనున్నట్టు ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు మత్స్యకార మహిళలు కలశాలతో ఎగువపేట ముఖద్వారం నుంచి ఊరేగింపుగా బయలుదేరి పోలమాంబ ఆలయానికి చేరుకుంటారని చెప్పారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

గురుకుల పాఠశాలలో ముగిసిన స్పోర్ట్స్ మీట్

సింహాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం బీసీ గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న స్పోర్ట్స్ మీట్ సోమవారంతో ముగిసింది. ప్రిన్సిపాల్ రమా మోహిని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్‌జేడీ విజయభాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగితే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చునని చెప్పారు. అనంతరం ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు



భీమునిపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 10న జరిగే వైకుంఠ ఏకాదశికి శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ వంశ పారంపర్య అర్చకుడు రొంపిచర్ల సింగరాచార్యులు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు తెల్లవారుజామున రెండు గంటల నుంచి స్వామివారికి పంచామృత, ఫలరస, నదీ జలాలు, దివ్య ఔషధాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం 3.30 నుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల విక్రయం ప్రారంభం

సింహాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈనెల 10న జరిగే అప్పన్న స్వామి ఉత్తర ద్వార దర్శనం టిక్కెట్ల విక్రయాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఏఈవో ఆనంద్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆలయ అభివృద్ధికి రూ. 30 వేలు విరాళం



విరాళం చెక్కు అందిస్తున్న వెంకటేశ్

ఆనందపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు కూరకుల వెంకటేశ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ. 30 వేల విరాళం అందజేశారు. సోమవారం స్థానిక కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో కూరాకుల సంజీవరావు, అప్పలకొండమ్మ దంపతుల జ్ఞాపకార్థం పంచాయతీ పరిధిలోని పలువుర్ని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు బి. కృష్ణారావు, వై. అజయ్ శేఖర్, ఎస్‌బీఐ మేనేజర్ గోవిందరావు, రేవంత్, బావిశెట్టి ప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు వెంకటరావు, పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు అప్పారావు మృతి పట్ల నివాళి

తగరపువలస, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీపీఐ నాయకుడు చెల్లూరి అప్పారావు (85) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పార్టీ నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, అల్లు బాబూరావు, చిల్ల నరసింహులు సంతాపం వ్యక్తం చేశారు.

పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ విజేత భీమిలి



విజేతలతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

భీమునిపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్‌లో భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. కళాశాల విద్యార్థినులు పలు క్రీడల్లో అత్యంత ప్రతిభ ప్రదర్శించడంతో విజేతలుగా నిలిచారు. ఈనెల 2వ తేదీ నుంచి నగరంలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన ఈ పోటీల్లో 30 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్ సింగిల్స్, బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడలతో పాటు 800 మీటర్లు, 4 ఇన్ టూ 100 రిలే పరుగు షార్ట్‌పుట్‌లో భీమిలి కళాశాల బాలికలు ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే టేబుల్ టెన్నిస్ సింగిల్స్, వాలీబాల్, 400 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హై జంప్, ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానం, టేబుల్ టెన్నిస్ డబుల్స్, 400 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షార్ట్‌పుట్‌లో తృతీయ స్థానం పొం దారు. విజేతలను ఆ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ, తదితరులు అభినందించారు. విజేతలంతా ఈనెల 27, 28, 29 తేదీల్లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్టేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనున్నట్టు చెప్పారు.

కొనసాగుతున్న కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థుల పరుగును పర్యవేక్షిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాక్షినగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో మహిళా అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు సోమవారం కూడా కొనసాగాయి. మహిళా పోలీసు అధికారుల పర్యవేక్షణలో వీటిని నిర్వహించారు. తొలుత అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి, మైదానంలోకి అనుమతించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి. 718 మంది అభ్యర్థులకు 342 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి. అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్లు టి. లక్ష్మి, టి. కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగంలో సమస్యలపై పరిశోధనలు

సాగర్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రంగంలో నెలకొన్న సమస్యలపై పరిశోధనలు చేపట్టనున్నట్టు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్ కృష్ణ తెలిపారు. గీతం వర్సిటీ బయోకెమిస్ట్రీ డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆక్వా సాగు సున్నితమైనదని, వాతావరణంలో మార్పులు, చెరువులకు నీటి నాణ్యత, మందుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టాలు ఎదురవుతాయన్నారు. నీటి నాణ్యత విషయంలో గీతం వర్సిటీ నుంచి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏకే రెడ్డి, డాక్టర్ కె. ఫణిప్రకాశ్,అఖిల భారత ష్రింప్ అసోసియేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఎంపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు

కొమ్మాది, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదుకు మహిళలు, యువత స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ అన్నారు.సోమవారం ఆయన ఆధ్వర్యంలో పీఎంపాలెంలోని ఆర్‌హెచ్ కాలనీ, ఎల్‌ఐజీ బ్లాకులో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి సత్యనారాయణ, బబ్బేలు, అబ్దుల్ భాషా, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా వితరణ

కొమ్మాది, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి ఆ వార్డు జనసేన అధ్యక్షుడు దేవర శివ తన సొంత నిధులతో బీరువా, పిల్లలకు అవసరమైన సామగ్రి వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై పెంపుపై అభిప్రాయ సేకరణ

మధురవాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపుపై మంగళవారం నుంచి మూడు రోజుల పాటు వినియోగదారుల నుంచి ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి నేరుగా, వర్చువల్ పద్ధతిలో అభిప్రాయాలు సేకరించనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళ, బుధవారం విజయవాడ బృందావన్ కాలనీలోని ఏ కన్వెన్షన్ సెంటర్ నుంచి, 10న కర్నూలు ఏపీఈఆర్‌సీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు తీసుకుంటారని చెప్పారు.ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు అధికారులు అభిప్రాయాలు తీసుకుంటారన్నారు. అభిప్రాయ సేకరణలో పాల్గొనేవారు ముందుగా మధురవాడ విద్యుత్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారితో పాటు నమోదు చేసుకోలేని వారి నుంచి కూడా అభిప్రాయాలు తీసుకుంటామన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గాజువాక ప్రాంతానికి చెందిన జి.వెంకన్న రూ. లక్ష విరాళంగా అందజేశారు.విరాళం మొత్తాన్ని దాత నగదు రూపంలో ఆలయ ప్రోటోకాల్ సూరింటెండెంట్ విక్రమ్‌కు సోమవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దాకమర్రిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

భీమునిపట్నం (రూరల్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాకమర్రి గ్రామంలో సర్వే నంబర్లు 356, 348, 243, 239లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అక్రమార్కులు స్థానిక నాయకుల సహకారంతో రాత్రి, పగలు తేడా లేకుండా లారీలు, ట్రాక్టర్లలో గ్రావెల్ తరలించుపోతున్నారు. ఈ విషయమై గ్రామస్తులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు గ్రావెల్ అక్రమ తవ్వకాలపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

మళ్లీ వైరస్ టెన్షన్

... 5వ పేజీ తరువాయి

ఫ్లూ మాదిరిగా వచ్చి తగ్గుతుందని పేర్కొంటున్నారు. బ్రాంకైటిస్, న్యుమోనియా, ఆస్తమా ఉన్న వారిలో తీవ్రత కొంత ఎక్కువగా ఉంటుందంటున్నారు. మాస్క్ ధరించడం, చేతులను శుభ్రం చేసుకోవడం కీలకమని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలని చెబుతున్నారు.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. జాగ్రత్తలు అవసరం

- డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

దేశంలో కూడా కేసులు నమోదైన నేపథ్యంలో కొంత అప్రమత్తంగా ఉండడం అవసరం. ఈ వైరస్ కూడా కరోనా జాతికి చెందినదే. ఇది అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా పిల్లల్లో, 65 ఏళ్లు దాటిన వారిలో దీని వ్యాప్తి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికిప్పుడు ఈ వైరస్ ప్రమాదకర స్థాయిలో వ్యాప్తి చెందే అవకాశం లేదు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వైద్యుల సూచనల మేరకు నడుచుకోవాలి. పానిక్ కావద్దు. అనుమానాలు, భయాలను పెట్టుకోవద్దు.

ప్రధాని సభకు చకచకా ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఏడు వేల వాహనాలు వినియోగించనున్నారు. సభకు వచ్చే జనం కోసం మూడు లక్షల ఫుడ్‌ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి బహిరంగ సభకు వచ్చే వారి కోసం 1.1 లక్షల ప్యాకెట్లు బస్సులు/వాహనాలు బయలుదేరే పాయింట్లకు పంపుతారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చే వారికి నాతవలస టోల్‌గేట్ వద్ద 15 వేల ప్యాకెట్లు అందిస్తారు. అనకాపల్లి నుంచి వచ్చే వారికి 40 వేలు, విజయనగరం జిల్లా నుంచి వచ్చే వారికి 15 వేల ప్యాకెట్లు ఆయా జిల్లాల అధికారులు బస్సుల్లోనే అందించనున్నారు. సభ అనంతరం తిరిగి వెళ్లేప్పుడు పంపిణీ చేసే నిమిత్తం విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారికి 1.25 లక్షలు, విజయనగరం, అనకాపల్లి నుంచి వారికి 55 వేల ఆహార ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. ఇవి కాకుండా ప్రత్యామ్నాయంగా అనకాపల్లి నుంచి వచ్చే వారికి అగనంపూడి టోల్‌గేటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చే వారికి రాజాపులోవ సమీపాన అవంతి కళాశాల, అడవివరం జంక్షన్ వద్ద అందించేందుకు 20 వేల స్నాక్స్ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. కాగా రోడ్ షోలో పాల్గొనే 70 వేల మందికి స్నాక్స్ పంపిణీ చేయాలని భావించారు. అయితే ప్రధాని భద్రతను పర్యవేక్షించే ఎస్పీజీ అధికారులు అనుమతి ఇవ్వనందున వాటి పంపిణీ రద్దు చేశారు.

ప్రధాన వేదిక వరకూ రోడ్‌షో

ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభా వేదిక వరకూ రోడ్‌షో నిర్వహించనున్నారు. దీనిపై ఇంతవరకూ అధికారికంగా స్పష్టత రాకపోయినా సోమవారం వేదిక ముందు ప్రాంగణం మధ్య నుంచి తారురోడ్డు వేశారు. దీనిని బట్టి రోడ్డు షో ఏయూ ఎకనామిక్స్ విభాగం ఎదురుగా గల వెంకటాద్రి వంటిల్లు వద్ద నుంచి ప్రారంభమై త్రీటౌన్ జంక్షన్, ఏయూ మహిళా మీదుగా వేదిక వరకూ సాగుతుందని భావిస్తున్నారు. వెంకటాద్రి వంటిల్లు నుంచి రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు నిర్మించారు. కాగా ప్రధాని పర్యటించే ప్రాంతంలో ఎస్పీజీ అధికారు లు తనిఖీలు ముమ్మరంచేశారు.

ఐటీ కంపెనీలను జగనే తెచ్చారట!

... 5వ పేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. అలాగే భోగాపురంలో విమానాశ్రయం నిర్మాణానికి 2019లోనే సీఎంగా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ విమానాశ్రయాన్ని కూడా జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చినట్టు అమర్ చెప్పుకున్నారు. అదేవిధంగా రుషికొండపై ప్యాలెస్‌ను జగన్ రూ.500 కోట్లతో సొంతం కోసం నిర్మించుకోలేదని అమర్ అడ్డగోలుగా మాట్లాడారు. నాటి సీఎం జగన్ తన నివాసం కోసం సముద్ర తీరాన ఆ ప్యాలెస్ నిర్మించారని అందరికీ తెలుసు. ఇప్పుడు దానిని ప్రధాని, రాష్ట్రపతి విడిది కోసం ఉపయోగించుకోవాలని అమర్ ఓ సలహా కూడా పారేశారు. ప్రధాని, రాష్ట్రపతి విశాఖపట్నం వస్తే కొన్ని గంటల్లోనే ఇక్కడి కార్యక్రమం చూసుకొని వెళ్లిపోతారు. అంత ఎందుకు బుధవారం ప్రధాని మోదీ విశాఖపట్నం వస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు దిగి తిరిగి రాత్రి 7 గంటలకు బయల్దేరి వెళ్లిపోతున్నారు. ఇలా మూడు, నాలుగు గంటలు ఉంటే వీవీఐపీల విడిది కోసం రూ.500 కోట్ల భవనం ఏడాది పొడవునా ఖాళీగా ఉంచాలా?...ఇదేనా ప్రజాధనం పట్ల బాధ్యత..? అని అమర్‌నాథ్ మాటలపై విశాఖ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.

అంధుల ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆంధ్ర విజయం

విశాఖపట్నం స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన తొలి అంధుల ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ పెనాల్టీ షూటౌట్స్‌లో ఒడిశాపై విజయం సాధించింది. నేత్ర విద్యాలయ గ్రౌండ్‌లో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ ఆకట్టుకుంది. మ్యాచ్ నిర్ణీత సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు చెరో గోల్ చేయడంతో డ్రా అయింది. దీంతో విజేతలను నిర్ణయించేందుకు రిఫరీ పెనాల్టీ షూటౌట్స్‌ను నిర్వహించారు. కెప్టెన్ సూర్య నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ఆటగాళ్లు షూటౌట్స్‌ను గోల్స్‌గా మలచడంలో విజయవంతం అయ్యారు. ఒడిశా ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో షూటౌట్స్‌ను గోల్స్‌గా మలచడంలో విఫలం కావడంతో ఓటమి తప్పలేదు. అంధుల ఫుట్‌బాల్‌ను ఆంధ్రాలో పరిచయం చేయడంలో కోచ్ భుజన్ భూపతి రాజు విశేషంగా కృషి చేశారు. ఇండియన్ బ్లైండ్ ఫుట్‌బాల్ ఫెడరేషన్‌లో కీలకపాత్ర పోషిస్తున్న భుజన్...నేత్ర విద్యాలయ నిర్వాహక బృందం సోమేష్, శిరీషా, ఉదయ్‌కిరణ్‌ల సహకారంతో అంధుల ఫుట్‌బాలర్లను తీర్చిదిద్దారు.

జిల్లా ఓటర్లు 20,15,934

... 5వ పేజీ తరువాయి

ఓటర్లు 23,292 మంది ఉన్నారు. ఆ తరువాత 1,549 మంది కొత్తగా ఓటు నమోదు చేయించుకోవడంతో వారి సంఖ్య 24,841కు పెరిగింది. ఇదిలావుండగా జిల్లాలో 3,610 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 3,494, మహిళలు 116 మంది ఉన్నారని కలెక్టర్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితాను జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి/తహసీల్దారు కార్యాలయాలు, అన్ని పోలింగ్ బూత్‌లలో అందుబాటులో ఉంచామన్నారు.



ఉదయం 7.30 గంటల సమయంలో హనుమంతవాక జంక్షన్‌లో మంచు

పొగమంచుతో అవస్థలు

ఆరిలోవ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ప్రాంతంలో దట్టంగా పొగమంచు కురుస్తోంది. మంచుతో ఈ ప్రాంతం కమ్ముకోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఉదయం దారి కూడా కనిపించని పరిస్థితి ఉంటోంది. వాహనదారులు నెమ్మదిగా ముందుకు వెళ్లవలసి వస్తోంది. దీనికితోడు చలి పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మంచు తీవ్రత వల్ల కొందరికి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. తప్పనిసరిగా తలకు మంకీక్యాప్ ధరిస్తున్నారు.

'క్రీడల్లో రాణించాలి'



విద్యార్థులతో ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు చెప్పారు. జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను కళాశాలలో సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందన్నారు. క్రీడల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులకు తమ ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఫిజికల్ డైరక్టర్ వి. సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎండాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తలకు తీవ్ర గాయం కావడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కల్లూరి శ్రీను సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పీఎంపాలెం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. మధురవాడ వాంబే కాలనీలో నివాసం ఉంటున్న కల్లూరి శ్రీను (38) పూల అలంకరణ పని చేస్తుంటాడు. ఈనెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చాడు. మరుసటి రోజు తెల్లవారుజామున ఐదు గంటలకు కింద పడిపోయి ఉండడంతో తలకు గాయమైనట్టు కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 46, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 46, బీరకాయలు 52,ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 18, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయ 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 60, కీరదోస 36,క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 44, కొండ ఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

'భోజనం'తో ఇంటర్ విద్యార్థుల్లో ఆనందం

- తగ్గిన ఆకలి బాధలు, అదనపు ఖర్చు
- పెరగనున్న ఉత్తీర్ణత శాతం

మద్దిలపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల ఆకలి తీర్చడం ద్వారా హాజరుశాతం, ఉత్తీర్ణత శాతం పెంచడం, ఆయా కుటుంబాలకు ఉపశమనం కలిగించడం అనే బహుళ ప్రయోజనాలను కాంక్షించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంతో ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ నెల 4 నుంచి అమలు చేసిన ఈ పథకం మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ కళాశాలలో 912 మంది విద్యార్థుల కడుపు నింపుతోంది. ఈ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నగర పరిధి మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రాంతాలు, పక్క జిల్లాల విద్యార్థులు సైతం ఇక్కడ చదువున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాల తరగతులు కొనసాగడంతో మధ్యాహ్నం విద్యార్థులు ఆకలితో ఉండేవారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఉదయం 7 గంటలకే ఇళ్ల వద్ద బయలుదేరాల్సి రావడంతో క్యారేజీలు కూడా తెచ్చుకునే అవకాశం ఉండేది కాదు. ఉదయం తీసుకున్న అల్పాహారంతోనే రోజంతా కళాశాల గదుల్లో ఆకలితో ఉండేవారు. 2018లో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన మధ్యాహ్న భోజనం పథకం వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దు చేశారు. దీంతో అయిదేళ్ల విద్యార్థులకు భోజనం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం రాగానే విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ఇంటర్మీడియట్ విద్యార్థులపై దృష్టి సారించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరు నమోదు, ఉత్తీర్ణత శాతం మెరుగుపరచడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో



వీఎస్ కృష్ణ కళాశాలలో భోజనం చేస్తున్న బాలికలు

భాగంగా ఇంటర్ విద్యార్థులకు ఆకలి లేని చదువులు అందితేనే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని భావించి మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారు. యవ్వన దశ కావడంతో విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించడానికి చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఠంచనుగా భోజనం పెట్టడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోజూ మెనూ ఇలా...

సోమవారం: కూరగాయల పలావ్, కోడిగుడ్డు కూర, వేరుశ నగ, బెల్లం చిక్కి.

మంగళవారం: పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు, రాగిజావ.

బుధవారం: కూరగాయల అన్నం, ఆలుకుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కి.

గురువారం: సాంబార్ బాత్, లెమన్ రైస్, టమోట పచ్చడి, ఉడికించిన కోడ్డు.

శుక్రవారం: అన్నం, ఆకుకూర, పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, బెల్లం చిక్కి.

శనివారం: ఆకుకూర అన్న, పప్పుచారు, రాగిజావ, స్వీట్ పొంగల్.

పల్లె నుంచి రావడం కష్టంగా ఉండేది



సమయానికి కళాశాలకు రావాలంటే ఉదయం 7 గంటలకు ఇంటి వద్ద బయలుదేరాలి. అంతా ఉదయం క్యారేజీ పట్టుకోవాలంటే వంట అయ్యేది కాదు. సైన్స్ గ్రూప్ కావడంతో తరగతులకు అందనేమోనని ఒక్కో రోజు టిఫిన్ కూడా చేయకుండా కళాశాలకు రావాల్సి వచ్చేది. ఇప్పుడు ఇబ్బంది లేదు.

- ఎం.రాధిక బైపీసీ, కొత్తవలస, విజయనగరం జిల్లా

రోజూ రూ.100 ఖర్చు కష్టమని..



ఉదయం 7 గంటలకు కళాశాలకు బయలుదేరుతాను. ఆ సమయంలో టిఫిన్ కూడా ఉండదు. మధ్యాహ్న భోజనం చేయాలంటే రూ.100 ఉండాలి. అందుకే ఆకలితో ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఆకలి సమస్య పోయింది.

-ఎం.హరీష్ బైపీసీ, భీమిలి.

శక్తి సన్నగిల్లేది



మా ఊరి నుంచి కళాశాలకు రావాలంటే ప్రయాణ సదుపాయం చాలా తక్కువ. అడవుల్లో ఉన్నందున ఉదయమే అడవివరం వచ్చి బస్ ఎక్కితే 9 గంటలకు చేరుకుంటాను. ఆకలితో రోజంతా ఉండడం రెండు వైపుల ప్రయాణంతో శక్తి సన్నగిల్లేది. మధ్యాహ్న భోజనంతో ఆకలి పోయి ఉత్సాహం వస్తుంది. **పి.మేఘన బైపీసీ, దబ్బంద అడవివరం.**

హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ టెర్రర్

- కానరాని పోలీసులు
- వాహనాల తోరణంతో ప్రయాణ కష్టాలు

ఆరిలోవ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హనుమంతవాక జంక్షను పేరు చెబితే చాలు.. వాహనదారులు, ప్రయాణికులు జడుసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. పెరిగిన వాహన వినియోగంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ నుంచి వాహనాలు వెళ్లాలంటే కనీసం పది నిమిషాలు వేచి ఉండవలసి వస్తుంది. వెంకోజీపాలెం నుంచి ఆదర్శనగర్ వరకు వాహనాలు నిలిచిపోతుంటాయి. ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో వాహనాలు గూడ్సు రైలును తలపిస్తుంటాయి.పాదచారులు వెళ్లడం కూడా కష్టంగా ఉంటోంది. రాకపోకలకు మార్గం సుగమం చేయడం పోలీసులకు శక్తికి మించిన పనిలా ఉంది. సింహాచలం, వెంకోజీపాలెం, జంతుప్రదర్శన శాల,



జంక్షన్‌లో బారులు తీరిన వాహనాలు

విశాలాక్షి నగర్‌ల నుంచి నలువైపులా ఈ జంక్షన్ గుండానే రాకపోకలు సాగుతుంటాయి. కొద్దిమంది మాత్రం బీచ్ రోడ్డులో వెళ్తుంటారు. నిర్ణీత సమయంలో ఇక్కడ నుంచి జంక్షన్‌ను దాటడం కష్టమే. ఒక్కసారి వచ్చి ఆగిన వాహనాలు ఒకేసారి ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. అందువల్ల ఎక్కువ సమయం పడుతోంది. ఉదయం 7 నుంచి 10 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 వరకు విద్యాసంస్థలు, కార్యాలయాలకు వెళ్లి



వచ్చే వారితో ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఆ తరువాత కూడా నగరంలోకి వ్యాపారం, ఇతర పనులపై వచ్చే వారు, ఆర్టీసీ బస్సులతో కిక్కిరిసిపోతుంది. భోగాపురం విమానాశ్రయం ప్రారంభించేలోగా ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తికాకుంటే భవిష్యత్తులో రాకపోకలు ఊహలకే అందనంత భారంగా కనిపిస్తోంది. సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ఇతర సిబ్బంది రంగంలోకి దిగితే తప్ప ట్రాఫిక్‌ను క్లియర్ చేయలేకపోతున్నారు. సంక్రాంతి పండుగ కారణంగా గత పది రోజులుగా పరిస్థితి తీవ్రంగా ఉంటోందని సీఐ అన్నారు. ఏటా పెద్ద సంఖ్యలో కొత్త వాహనాలు రోడ్డెక్కడంతో ట్రాఫిక్ పద్మవ్యూహంలో అందరూ చిక్కుకోవలసి వస్తోంది.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ వార్డుల నుంచి హాజరైన కార్పొరేటర్లు, నాయకులతో ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ బహిరంగ సభకు, ర్యాలీలోనూ పార్టీ శ్రేణులు పాల్గొనాలన్నారు. ప్రతి వార్డు నుంచి నాయకులు, కార్యకర్తలు సభ విజయవంతానికి కృషి చేయాలని,ప్రజలు భారీగా ప్రధాని సభలో పాల్గొనేలా చూడాలని కోరారు.ప్రధాని సభను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. ప్రధాని రాక సందర్భంగా ఉత్తరాంధ్రలోని పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారని, అందుకు కృతజ్ఞతగా భారీగా జనం హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సమావేశంలో వివిధ వార్డుల టీడీపీ అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

తొలగనున్న ఏయూ ఉద్యోగుల ఇబ్బందులు

యూనివర్సిటీ ఉద్యోగుల ఇబ్బందులు త్వరలోనే సమసిపోతాయని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్ర యూనివర్సిటీ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఉద్యోగులు రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో యూనివర్సిటీ ఉద్యోగులు బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ యూనివర్సిటీ సంక్షేమం, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని అన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు పీతల అమరేంద్ర, ఒమ్మి నూకరాజు, బండారి దేముడు, చిరంజీవి, గణేష్, యాసిన్ బాబా, పీతల వెంకటరావు,రమేష్, గణేష్, సాయిబలరాం, పైడిరాజు, రామారావు, కుమార్, రవికిరణ్, దావీదు పాల్గొన్నారు.

ఈ బార్‌కు ఏ వేళలో వచ్చినా మద్యం లభ్యం

- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- మందుబాబులతో మహిళలకు ఇబ్బందులు



ఉదయాన్నే దుకాణం వద్ద జరుగుతున్న అమ్మకాలు

వెంకోజీపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మందుబాబులకు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్ షాప్‌ల వద్ద, రాత్రి 11 గంటల వరకు బార్‌ల వద్ద మద్యం లభిస్తుంది. కానీ ఇక్కడ బార్‌లో మాత్రం 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు దుకాణంలో నేరుగా లభిస్తుంది. ఆ తరువాత వెనుక ఉన్న గదిలో తలుపు కొడితే చాలు..మద్యం ఇస్తారు. కొనుగోలుచేసుకుని వెళ్లిపోవడమే కాదు...ఇక్కడే మద్యం తాగి వెళ్లవచ్చు. ఇదీ హెచ్‌బీ కాలనీలోని సంధ్యా బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాకం. ఈ బార్‌కు దగ్గరలోనే ఎక్సైజ్ కార్యాలయం కూడా ఉంది. అయినా జంకు లేకుండా మద్యాన్ని 24 గంటలూ అందుబాటులో ఉంచుతున్నారు. రోజూ ఉదయాన్నే బడికి వెళ్లే చిన్నారులు, వారిని తీసుకెళ్లే తల్లులు ఈ బార్ వద్దనే నిల్చుని స్కూల్ బస్సు కోసం ఎదురుచూస్తారు. మద్యం బాబులతో వీరు ఒక్కోసారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకులపై చర్యలు తీసుకుని చిన్నారులకు, మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



రహదారిపై నిలిపివేసిన వాహనాలు



బస్ షెల్టర్ వద్ద నిలిపి ఉన్న వాహనాలు

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

ఎంవీపీ కాలనీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ సర్కిల్ సమీపంలో ఉన్న రహదారిపై వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేస్తున్నారు. దీని వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక్కడ కొత్తగా ఓ హోటల్ ఏర్పాటు చేశారు. కొత్త కదా జనం ఎగబడుతున్నారు. అక్కడ బిర్యానీ కోసం క్యూ కడుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది. కానీ ఆ జనంతో వచ్చే చిక్కులు ఆ దారి వెంట ప్రయాణం చేసేవారిని వెంటాడుతున్నాయి. ఆ హోటల్‌కు ప్రత్యేకించి బయట స్థలమేదీ లేదు. దీంతో జనం రోడ్డుపైనే క్యూకడుతుండగా, వారి వాహనాలు రోడ్డు పక్కన పార్కింగ్ చేయడంతో సగం రోడ్డు వాటికే సరిపోతోంది. దారి వెంట ప్రయాణించే వాహనదారులకు చాలా ఇబ్బంది ఎదురవుతోంది. ట్రాఫిక్ పోలీసులూ లేరు,కనీసం సదరు హోటల్ సిబ్బంది కూడా ఈ పరిస్థితిని సరిదిద్దకపోవడంతో అమ్మినోళ్లు, కొన్నోళ్లు బాగానే ఉన్నారు.. మధ్యలో మాకేంటి ఈ తంటా అని ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు.

16వ బెటాలియన్‌లో సీపీకి సన్మానం

కొమ్మాది, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే పోలీసులకు క్రీడల వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఉల్లాసం కలుగుతుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. బక్కన్నపాలెం 16వ పోలీస్‌బెటాలియన్‌లో సోమవారం క్రీడా వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా వారు మాట్లాడారు.బెటాలియన్ సిబ్బందికి ఎప్పటికప్పుడు ఆయుధ పని తీరు, వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సిబ్బంది బైక్ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీ కృష్ణ, ఏపీఎస్‌పీ బెటాలియన్ ఐజీ రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.



సీపీ బాగ్చీని సన్మానిస్తున్న కమాండెంట్ మురళీ కృష్ణ

మేయర్ గారూ.. ఇంకా జగనే ముఖ్యమంత్రా ?



మేయర్ క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం జగన్ చిత్రం

ఆరిలోవ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) :వైసీపీ నాయకులు తమ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి చిత్రాలను వ్యక్తిగత, పార్టీ కార్యక్రమాల్లో పెట్టుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి క్యాంపు కార్యాలయంలో నేటికీ జగన్ ముఖ్యమంత్రిగా , వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ చైర్మన్‌గా చిత్రాలు ప్రదర్శించడం సందర్శకులకు విస్తుగొలుపుతోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టి దాదాపు ఎనిమిది నెలలు కావస్తోంది. టీటీడీకి కొత్త చైర్మన్ కూడా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. కానీ మేయర్ అధికారిక నివాసంలో బాధ్యులకు ఇంకా ఈ విషయం తెలిసినట్టు లేదు. మేయర్ క్యాంపు కార్యాలయానికి జనవరి 1న పలువురు అధికారులు వచ్చి శుభాకాంక్షలు తెలిపి వెళ్లారు. సందర్శకులకు ఎదురుగానే కనిపిస్తున్న ఈ చిత్రాలు, హోదాలు మార్చాలన్న సలహా అధికారులు ఇచ్చినట్టు లేదు. ఒకవేళ సలహా ఇచ్చినా మేయర్ ఎందుకు పాటించలేదో తెలియడం లేదు.

బాలల హక్కుల పరిరక్షణకు భరోసాగా నిలవండి



సంస్థ లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

వెంకోజీపాలెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణకు శత శాతం భరోసాగా నిలవాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నూతన బాలల హక్కుల పరిరక్షణ చైతన్య ఫోరం (న్యూ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ అవేర్నెస్ ఫోరం) పేరిట ప్రభుత్వ రిజిస్ట్రేషన్ లాంఛనాలు పూర్తి చేసుకున్న ఈ సంస్థ ప్రతినిధులు సోమవారం ఆమదాలవలసలోని తమ్మినేని స్వగృహంలో సంస్థ పేరుతో లోగో ఆవిష్కరింపజేశారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ బాలలపై రాష్ట్రంలో నిత్యం వెలుగులోకి వస్తున్న దాడులు, లైంగిక చర్యలను గమనిస్తే వారి సంక్షేమానికి పోరాటం చేసేందుకు ఇలాంటి సంస్థలు ముందుకు రావలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, నూతన ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి. ధనలక్ష్మి, తమ్మినేని చిరంజీవి నాగ్, కిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

9న విశాఖ నివాస హక్కుల పోరాట దినం



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

సిరిపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం విశాఖ నగర కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 9న విశాఖ నివాస హక్కుల పోరాట దినం నిర్వహిస్తున్నట్టు పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తెలిపారు.సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో 'వర్తమానంలో నివాస హక్కుల ఉద్యమ సవాళ్లు-కర్తవ్యాలు' కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9న ఉదయం 10 గంటలకు రైల్వే న్యూకాలనీ సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక హైకోర్టులో ప్రముఖ న్యాయవాది జేవీ చలపతిరావు ప్రారంభోపన్యాసం చేస్తారన్నారు. వక్తలుగా రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి, బానాస రాష్ట్ర నాయకుడు టి.శ్రీరామ్మూర్తి, దళిత విముక్తి,ఎస్‌వీ రమణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, కె.వి. కె.నిర్మల, కె.వి.రమణ తదితరులు ప్రసంగిస్తారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సదస్సు స్థలం నుంచి జీవీఎంసీ కమిషనర్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తామన్నారు. 2012లో జరిగిన పోరాటానికి గుర్తుగా 9న నివాస హక్కుల పోరాట దినంగా పాటిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట లక్ష్మి, డీకేఎస్ రోహిణి దేవి, ఎంఎస్ఎస్ఎస్ నగర కన్వీనర్ లక్ష్మి, కో-కన్వీనర్ పరదేశి, కె.బాల నాగమ్మ, కె.రామారావు, బి.భూషణం తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరాంధ్ర అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు'

రామ్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. సోమవారం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాని వస్తుండడం శుభపరిణామమని అన్నారు. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర అత్యంత వెనుకబాటుతనానికి గురవుతోందని, రాష్ట్ర విభజన హామీలలో ఒక్కటీ అమలు కాలేదన్నారు. అమరావతికి దీటుగా ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, పరిశ్రమలలో స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ప్రకటించి, వలసలు అరికట్టాలని కోరారు. సమితి నాయకులు పెదిరెడ్ల సత్యం, రాజ్‌కుమార్, పి.శ్రీనివాసరావు, పైడం నాయుడు, పట్నాయక్, సూర్యారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ విద్యలతో బాలికలకు రక్షణ



స్వీయరక్షణపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఆరిలోవ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై లైంగిక దాడుల నిరోధానికి కరాటే, కుంగ్ ఫూ వంటి యుద్ధ విద్యలు నేర్చుకుంటే స్వీయరక్షణ పొందవచ్చని జేసీఐ ప్రాజెక్టు డైరెక్టర్ సాయిలక్ష్మి అన్నారు.విద్యార్థినులకు స్వీయ రక్షణపై సోమవారం తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జేసీఐ విశాఖ స్వచ్ఛంద సంస్థ సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు ఏవిధంగా ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి ? అత్యవసర పరిస్థితుల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలి? అనే అంశాలపై మెలకువలు తెలిపారు. నేడు బాలికలకు, మహిళలకు రక్షణ లేని పరిస్థితుల్లో గుండె ధైర్యంతో ఎదుర్కోవలసిన విధానాన్ని విద్యార్థినులకు ఆమె వివరించారు. మంచి, చెడు స్పర్శ (గుడ్ టచ్, బ్యాడ్ టచ్)లను వివరించారు. మానసిక ఆనందం కలిగించే క్రీడలపై కూడా దృష్టి నిలపాలని సూచించారు. ఆర్మీ మాజీ ఉద్యోగి, పీఈటీ మహేశ్వరరావు మార్గనిర్దేశకులుగా వ్యవహ రించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ హెచ్.జి.ఎఫ్. కిరణ్ పోలిపిల్లి, జేఎఫ్ఎం సంతోష్ నెమ్మాని, అన్నెపు ఆదిత్యసాయి, ప్రధానోపాధ్యాయిని గరిమెళ్ల దుర్గాభవాని, 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి వ్యక్తికి గాయాలు

ఎండాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. పీఎంపా లెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తాటిపూడి రాము సీలింగ్ పని చేస్తుంటాడు. సోమవారం లా కళాశాల రోడ్డు నుంచి పీఎంపాలెం కూడలి వైపు బైక్‌పై వెళుతుండగా అదుపు తప్పి బోల్తా పడడంతో గాయాలయ్యాయి. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్స్‌లో నేటి నుంచి హస్త కళాకారుల వస్తు ప్రదర్శన

మహారాణిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహారాణిపేట పరిధిలోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్‌లో మంగళవారం (నేటి) నుంచి 11 వరకు ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ హస్త కళాభివృద్ధి సంస్థ ఎండీ శ్రీవిశ్వ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో హస్త కళాకారులు తయారు చేసిన కళాఖండాలను విక్రయిస్తారని తెలిపారు. శ్రీకాళహస్తిలోని పెన్‌కలంకారీ పెయింటింగ్, కడపకు చెందిన అరటినార ఉత్పత్తులు, మన్యం జిల్లాలోని సవర ఆదివాసీల పెయింటింగ్‌లు, ఏటికొప్పాక లక్కబొమ్మలు ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. చేతివృత్తి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

రక్షణ గోడ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న శ్యామలా, కామేశ్వరి

కంచరపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు పెదకొత్తూరులో ప్రధాన గెడ్డకు సోమవారం మరమ్మతులు ప్రారంభించారు. ఇక్కడ గెడ్డకు రక్షణ గోడ (రిటెయినింగ్ వాల్) లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. గోడ మరమ్మతుల నిమిత్తం రూ.19.85 లక్షలు మంజూరు కావడంతో బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి పాల్గొని పనులను ప్రారంభించారు. ఏఈఈ అర్చన, గురువోజీ పాల్గొన్నారు.

నగర వీధుల్లో హరిదాసు కీర్తనలు


అక్షయపాత్రలో బియ్యం వేస్తున్న భక్తులు

సీతమ్మధార, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో రోజూ హరిదాసులు తుంబుర వాదనతో శ్రీరామకీర్తనలు పాడుతూ సీతమ్మధార ప్రాంతంలోని అన్ని వీధుల్లో తిరుగుతున్నారు. స్థానిక ప్రజలు హరిదాసును ఆహ్వానిస్తున్నారు. భక్తి పాటలు, కీర్తనలు పాడుకుంటూ వీధిలో సంచరిస్తుండగా మహిళలు బయటకు వచ్చి హరిదాసు తలపై ఉన్న అక్షయ పాత్రలో బియ్యం (స్వయం పాకం) వేసి సంప్రదాయ పద్ధతులను కొనసాగిస్తున్నారు.

ఏఐపీఏ ముఖ్య సలహాదారుగా నరవ ప్రకాశరావు నియామకం


ఒడిశాలో నియామక పత్రాన్ని అందుకుంటున్న నరవ ప్రకాశరావు

డాబాగార్డెన్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ (ఏఐపీఏ) మూడో జాతీయ సమావేశం ఈ నెల 4, 5 తేదీల్లో ఒడిశాలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి నగరానికి చెందిన నరవ ప్రకాశరావు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రకాశరావును ఏఐపీఏ ముఖ్య సలహాదారుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మూడేళ్లు ఈ పదవిలో కొనసాగుతారు. విద్య, వైద్యం పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీలో ఉండాలని, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్న జాతీయ విధానం-2020 మార్చాలని తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు నరవ ప్రకాశరావు తెలిపారు.

ఎంపీ శ్రీభరత్‌కు టీడీపీ నేతల సన్మానం

మహారాణిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎంపీ శ్రీభరత్ సారథ్యంలో విశాఖ అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని స్థానిక టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ నాయకులు ఎంపీ భరత్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమై నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. ప్రతీ కార్యకర్త ఇంటిలో ఆనందం వెల్లివిరియాలని ఎంపీ ఆకాంక్షించారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు నజీర్, గొంప ధర్మారావు, పీవీ వసంతరావు, నమ్మి రవికుమార్, భరణికాన రాజు ఉన్నారు.

జిల్లా ఓటర్లు 20,15,934

... 5వ పేజీ తరువాయి

ఓటర్లు 23,292 మంది ఉన్నారు. ఆ తరువాత 1,549 మంది కొత్తగా ఓటు నమోదు చేయించుకోవడంతో వారి సంఖ్య 24,841కు పెరిగింది.

ఇదిలావుండగా జిల్లాలో 3,610 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 3,494, మహిళలు 116 మంది ఉన్నారని కలెక్టర్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితాను జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి/తహసీల్దారు కార్యాలయాలు, అన్ని పోలింగ్ బూత్‌లలో అందుబాటులో ఉంచామన్నారు.

ప్రధాని రాకతో నగరానికి నగిషీలు


మాధవధారలో డివైడర్లకు రంగులు అద్దుతున్న సిబ్బంది


కాన్వెంటు కూడలిలో పార్కును శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

మురళీనగర్/జ్ఞానాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న నగరానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగంలో హడావుడి ఎక్కువైంది. నగర పాలక సంస్థ సిబ్బందితో కలసి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం శుభ్రతకు పెద్దపీట వేస్తోంది. సోమవారం ఒక్కసారిగా ఉరుకులు, పరుగులతో సిబ్బంది పలు పనుల్లో నిమగ్నమయ్యారు. ఎయిర్‌పోర్టు దాటాక మోదీ పర్యటన ఉండే రోడ్డు మార్గాన్ని సుందరీకరిస్తున్నారు. దెబ్బతిన్న హైవే డివైడర్లను ఇంజనీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో మరమ్మతులు చేపట్టి, రంగులు అద్దుతున్నారు. జీవీఎంసీ నిర్వహణలోని పచ్చదనాన్ని మరింత మెరుగ్గా తయారు చేయడానికి ఆపసోపాలు పడుతున్నారు. హైవే నాలుగు రోడ్ల మధ్య ప్రధాన డివైడరు సహా, నాలుగు లైన్ల సర్వీసు రోడ్డుకి ఇరువైపులా ఉన్న పచ్చదనం, రక్షణ కంచెలకు మరమ్మతులు చేపడుతున్నారు. నగరంలోకి ప్రవేశించాక ఎన్‌ఏడీ జంక్షన్, ఆర్ అండ్ బీ, బిర్లా జంక్షన్ దాటి ఊర్వశి, తాటిచెట్ల పాలెం వరకు సుందరీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. జీవీఎంసీ జోన్-5 అధికారులు స్థానిక సిబ్బందితో కలసి అత్యవసర పనులు చేయిస్తున్నారు. కాన్వెంట్ జంక్షన్ వద్ద ఎక్కడపడితే అక్కడ రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చుతున్నారు. డివైడర్లకు రంగులతో ముస్తాబు చేస్తున్నారు. రహదారికి ఇరువైపులా పచ్చతివాచీలు పరుస్తున్నారు. ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. కాన్వెంటు కూడలిలో జీవీఎంసీ జోన్-4, జోన్-5 పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బంది కలసి రోడ్లపై చెత్త చెదారాన్ని తొలగించారు. కాన్వెంటు కూడలి నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్లపై గుంతలు పూడ్చారు. పనులను జడ్సీ మల్లయ్యనాయుడు, బి.రాము, ఈఈ ప్రసన్నరెడ్డి, సహాయ వైద్యాధికారులు సునీల్‌కుమార్, కృష్ణంరాజులు పర్యవేక్షించారు.

మోదీ పర్యటనను జయప్రదం చేయాలి: విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు ఐక్యంగా అందరూ పాల్గొనాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పిలుపునిచ్చారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ప్రధాని పర్యటనకు ప్రజల తరలింపు, ఇతర ఏర్పాట్లపై సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొలమరశెట్టి శ్రీనివాస్, జోనల్ కమిషనర్ రాము, ఏపీడీ పుణ్యవతి, కూటమి నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, చిత్రంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు

వాల్తేర్ డివిజన్‌తో రైల్వే జోన్ ప్రారంభించాలి


» అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు చలసాని గాంధీ

డాబాగార్డెన్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వాల్తేర్ డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ తక్షణమే ప్రారంభించాలని అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు చలసాని గాంధీ కోరారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధేయ మార్గంలో రైల్వే జోన్ సాధించడం దేశ చరిత్రలోనే గొప్ప పోరాటంగా నిలిచిపోతుందన్నారు. రైల్వేజోన్ సాధనలో మీడియా, కార్మిక సంఘాలు, ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. విశాఖకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఆందోళన రైల్వే కార్మిక సంఘాలు, ప్రధానంగా మీడియా,


సమావేశంలో మాట్లాడుతున్న చలసాని గాంధీ

ప్రజాప్రతినిధుల కీలక పాత్రతో ఉద్యమ రూపు దాల్చి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభోత్సవానికి దారి తీసిందన్నారు. గౌతు లచ్చన్న, భాట్టం శ్రీరామ్మూర్తి, ద్రోణంరాజు సత్యనారాయణ, కింజరాపు ఎర్రన్నాయుడు, ఎంవీవీఎస్ మూర్తిలు అనేక విధాలుగా రైల్వేజోన్ కోసం కృషి చేశారన్నారు. రాష్ట్రంలో వాల్తేర్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లుకు కలిపి ఒక ప్రత్యేక జోనల్ హెడ్ క్వార్టర్స్ విశాఖపట్నంలో ఉంటుందన్నారు. వెంటనే కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. జోన్ ప్రారంభోత్సవం కాగానే కార్యకలాపాలు ప్రారంభించడానికి అవసరమైన భవనాలు ఇప్పటికే విశాఖలో సిద్ధంగా ఉన్నాయన్నారు. సాధించవలసిన ఇతరఅంశాలపై ఉమ్మడి పోరాటం చేయాలని గాంధీ పేర్కొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ


ఎన్‌సీసీ క్యాడెట్లకు పరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

అక్కయ్యపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ అంటే క్రమశిక్షణకు మారుపేరని ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ ఎంఎస్‌వీ విశ్వనాథం అన్నారు. ఆంధ్రా జూనియర్ డివిజన్ వింగ్, జూనియర్ డివిజన్ క్యాడెట్లకు సోమవారం ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు. దీనికి 26 మంది క్యాడెట్లు హాజరయ్యారు. రెండేళ్ల పాటు మిలటరీ డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ ట్రైనింగ్ ఇచ్చారు. 80 తరగతులు, 24 పీరియడ్లలో శిక్షణ పొంది, పది రోజులు ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లకు ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 125 మార్కులలో 50 శాతం పొందాలని విశ్వనాథం తెలిపారు. మార్చి 3న జాతీయ స్థాయిలో రాత పరీక్ష ఉంటుందని, ఇందులోనూ 50 శాతం మార్కులు రావాల్సి ఉంటుందని చెప్పారు. సి గ్రేడ్ 65, బి గ్రేడ్ 79, ఎ గ్రేడ్ 80కి పైగా శాతం మార్కులు సాధించాలని పేర్కొన్నారు. 50 శాతం కంటే తక్కువ మార్కులు పొందిన వారు ఎన్‌సీసీ సర్టిఫికెట్ పొందేందుకు అర్హత కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ హవల్దార్లు ఏఎస్ బదూరియా, తమ్మారియా పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లను ఆంధ్రా కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయ్‌కుమార్, సుబేదార్ మేజర్ జయప్రకాష్, ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ నరస అభినందించారు. ఈ కార్యక్రమంలో క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పోర్టులో కార్మికులకు ఉపాధి అవకాశాలు


అతిథుల సత్కార కార్యక్రమంలో కార్మికులు

అక్కయ్యపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల పాటు తమ జీవనోపాధి కోసం పోరాడిన విశాఖపట్నం పోర్టు క్యాజువల్ కార్మికుల కల ఎట్టకేలకు నెరవేరింది. క్యాజువల్ కార్మికులకు పోర్టులో ఉపాధి కల్పిస్తూ చైర్మన్ అంగముత్తు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం నరసింహనగర్ రైతుబజారు సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలిండియా పోర్టు, డాక్ వర్కర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు డీకే శర్మ ప్రసంగించారు. అనంతరం అతిథులను కార్మికులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోర్టు ట్రస్ట్ ట్రస్టీ అంజిబాబు, వివిధ సంఘాల నాయకులు మంగయ్య నాయుడు, ఎం.కోటేశ్వరరావు, గంట్ల శ్రీనుబాబు, కేఎస్ వర్మ, గుండు అప్పలరాజు, బాలు, నాయుడు పాల్గొన్నారు.



బోరింగ్‌ను కప్పేసిన చెత్త!

కంచరపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు పరిధి రెడ్డి కంచరపాలెం బసవవారివీధిలో చెత్తచెదారాలు పేరుకుపోతున్నాయి. వీధిలో బోరింగ్ వద్ద చెత్తను కుప్పలుగా వేయడంతో మంచినీరు కోసం వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. ప్రజలకు నిత్యం ఇక్కడ ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత సిబ్బంది చెత్తను ఇలా తరలించగానే, మళ్లీ వెంటనే వీధుల్లో కూడళ్ల వద్ద, మలుపుల వద్ద వేస్తుండడంతో అపారిశుధ్యం నెలకొంటోంది. .ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రెడ్డి కంచరపాలెంలోని బసవవారి వీధిలో బోరింగ్‌ను కప్పేసిన చెత్త

మాధవధార ఉడా కాలనీలో సమస్యాత్మక వ్యర్థాల తొలగింపు

మాధవధార, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తరంలోని 51వవార్డు మాధవధార ఉడాకాలనీలో నెలల తరబడి పేరుకున్న డెబ్రిస్ గుట్టల్ని సోమవారం తొలగించారు. 48ఎ బస్ రూట్‌లోని బస్టాప్ పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలు, స్థానికులు కాల్వల్ని ఆక్రమించి పోగుచేస్తున్న చెక్కల నిల్వల్ని 286 శానిటేషన్ సెక్రటరీ భాస్కర్ సిబ్బంది సాయంతో తొలగించారు. నివాసిత కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రహరీని ఆనుకొని పేరుకున్న నిల్వలతో ఉడా కమ్యూనిటీ హాలులో ఫంక్షన్ల నిర్వహణ సమయంలో ఇబ్బంది ఎదురవుతోంది. కమ్యూనిటీ హాలు వంటశాలను ఆనుకొని పెద్ద ఎత్తున పోగుచేస్తున్న చెక్కలు, కట్టెల వ్యర్థాలతో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు శానిటరీ సెక్రటరీ తెలిపారు. దిగువ కాలువ ప్రవాహాల మీదుగా ఇదే దారిలో బడ్డీలు వరుసగా ఏర్పాటు కావడంతో వీటిని ఆనుకుని ఈ చెత్త గుట్టలుగా ఫంక్షన్ హాలు చుట్టూ పేరుకుపోతోంది. పైగా ప్రక్కనే ఆర్టీసీ బస్టాప్ కూడా ఉండటంతో ప్రమాదాల్ని అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నారు. దీనిపై అక్కడే ఉన్న చెక్కలు, కట్టెలను పోగు చేస్తున్న వారు స్థానిక వార్డు కార్పొరేటరుకు ఫోన్ చేసి, పనులకు ఒక దశలో ఆటంకం కల్గించినా, సెక్రటరీ తన విధుల్ని పూర్తి చేశారు. వాగ్వాదాలకు చోటివ్వకుండా వ్యర్థాల్ని చిన్న పొక్లయిన్‌తో జీవీఎంసీ వ్యానులో తరలించారు.


పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

అంధుల ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆంధ్ర విజయం


విజేతల బృందం

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన తొలి అంధుల ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ పెనాల్టీ షూటౌట్స్‌లో ఒడిశాపై విజయం సాధించింది. నేత్ర విద్యాలయ గ్రౌండ్‌లో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ ఆకట్టుకుంది. మ్యాచ్ నిర్ణీత సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు చెరో గోల్ చేయడంతో డ్రా అయింది. దీంతో విజేతలను నిర్ణయించేందుకు రిఫరీ పెనాల్టీ షూటౌట్స్‌ను నిర్వహించారు. కెప్టెన్ సూర్య నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ఆటగాళ్లు షూటౌట్స్‌ను గోల్స్‌గా మలచడంలో విజయవంతం అయ్యారు. ఒడిశా ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో షూటౌట్స్‌ను గోల్స్‌గా మలచడంలో విఫలం కావడంతో ఓటమి తప్పలేదు. అంధుల ఫుట్‌బాల్‌ను ఆంధ్రాలో పరిచయం చేయడంలో కోచ్ శ్రుజన్ భూపతిరాజు విశేషంగా కృషి చేశారు. ఇండియన్ బ్లైండ్ ఫుట్‌బాల్ ఫెడరేషన్‌లో కీలక పాత్ర పోషిస్తున్న శ్రుజన్..నేత్ర విద్యాలయ నిర్వాహక బృందం సోమేష్, శిరీషా, ఉదయ్‌కిరణ్‌ల సహకారంతో అంధుల ఫుట్‌బాలర్లను తీర్చిదిద్దారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దుతూ అవసరమైన ప్రోత్సాహం అందించడంలో నేత్ర విద్యాలయ చూపుతున్న శ్రద్ధను పలువురు ప్రశంసించారు.

2026 నుంచి విశాఖకు విమానాలు బంద్

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. ఇవి మార్చితో పూర్తవుతాయని భావించారు. కానీ మట్టి స్వభావం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయి. ఆగస్టుకు కాని పూర్తికావని చెబుతున్నారు. ఈ పనులు జరుగుతున్నపుడు విమానాలు దిగడం కోసం ఉపయోగించే 'ఇనుస్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్(ఐఎల్ఎస్)'ను ఆపేస్తున్నారు. గత కొద్దికాలంగా రన్‌వే విస్తరణ పనులు జరుగుతుండడం వల్ల విమానాలతో ఐఎల్ఎస్ అనుసంధాన ప్రక్రియకు సాంకేతిక అవరోధాలు కలుగుతున్నాయి. రన్‌వే పనులు పూర్తయ్యేంత వరకు ఐఎల్ఎస్ సదుపాయం ఉండదని కూడా నేవీ అధికారులు ఈ సమావేశంలో స్పష్టం చేశారు. అదే విధంగా రన్‌వే పనులు త్వరితంగా పూర్తి చేయడానికి ఫిబ్రవరి నుంచి రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు విమానాల రాకపోకలను అనుమతించబోమని నేవీ అధికారులు వెల్లడించారు. విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ సర్వీసులు సింగపూర్, బ్యాంకాక్, కౌలాలంపూర్ నుంచి రాత్రి 11 గంటల తరువాతే వస్తున్నాయి. అవి రద్దు కాకుండా ఉండాలంటే... వాటి షెడ్యూళ్లు మార్చుకోవాలని, లేదంటే రాత్రి 12 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు రాకపోకలు నిలిపివేస్తామని నేవీ అధికారులు పేర్కొన్నారు.

15 స్లాట్ల పెంపునకు అంగీకారం

విశాఖ విమానాశ్రయం రన్‌వేను ప్రస్తుతం పౌర విమానాలకు, నేవీ విమానాలకు ఉపయోగిస్తున్నారు. పౌర విమానాలకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు గంటకు 12 స్లాట్లు మాత్రమే ఇస్తున్నారు. అంటే ఆరు విమానాలు వచ్చి, తిరిగి వెళ్లగలుగుతున్నాయి. దీనివల్ల కొత్త విమానాలు రావడానికి అవకాశం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో విశాఖ ఎంపీ శ్రీభరత్ స్లాట్ల సంఖ్యను 18కి పెంచాలని నేవీ అధికారులను కోరారు. అన్ని ఇవ్వలేమని 15 వరకూ మాత్రమే ఇస్తామని హామీ ఇచ్చారు.

దుబాయ్ విమానం పునరుద్ధరణపై దృష్టిపెట్టండి

... 5వ పేజీ తరువాయి

కొరత వల్ల ఇక్కడి సర్వీస్‌లు రద్దు చేసుకున్నాయన్నారు. వారితో మాట్లాడి సర్వీస్‌లు పునరుద్ధరణకు ప్రయత్నిస్తామని అధికారులు చెప్పారు. అంతర్జాతీయ సరకు రవాణాకు ఇంకా అడ్డంకులు తొలగలేదని, ఆ సమస్య పరిష్కారానికి త్వరగా చర్యలు చేపట్టాలని ఎంపీ శ్రీభరత్ ఆదేశించారు. బెంగళూరు, ముంబై నగరాలకు నడుస్తున్న విమానాలకు అత్యధిక డిమాండ్ ఉన్నందున సర్వీస్‌లు పెంచాలని పలువురు సభ్యులు సూచించారు. పౌర విమానాలకు ఆటంకం కలగకుండా చూడాలని ఐఎన్ఎస్ డేగా అధికారులను కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు.

కొత్త కమిటీ ఏర్పాటు

విశాఖ విమానాశ్రయం సలహా కమిటీకి పలువురు సభ్యులను నామినేట్ చేసే అధికారం ఎంపీకి ఉంది. ఆ కోటాలో పలు రంగాలకు చెందిన వారిని శ్రీభరత్ నామినేట్ చేసి, నియామకపు పత్రాలు సమావేశంలోనే అందజేశారు. రెండేళ్ల పదవీ కాలం ముగిసిన వారిని కొందరిని కమిటీ నుంచి తప్పించారు. దసపల్లా హోటల్ సీఈఓ వెంకటకృష్ణ, సింబయోసిస్ టెక్నాలజీస్ సీఈఓ ఓ.నరేశ్‌కుమార్, ఐటీ సంస్థ ఫ్లూయెంట్ గ్రిడ్ చైర్మన్ గన్నమనేని మురళీకృష్ణ, షోర్ ఫ్రంట్ రిసార్ట్ అధినేత సంజన, సీవీ ఇన్‌ఫ్రా డైరెక్టర్ సీవీ ప్రద్యుమ్న, రాధిక గ్రూపు ఇండస్ట్రీస్ అధినేత మన్వేందర్ మోర్, రామబ్రహ్మం అండ్ సన్స్ ప్రతినిధి కంచర్ల రామ్‌ప్రసాద్‌లను నియమించారు. వీరు విమానాశ్రయం అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషిచేయాలని భరత్ సూచించారు. ఈ కమిటీలో ప్రత్యామ్నాయ చైర్మన్‌గా విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, సిటీ పోలీస్ కమిషనర్ నామినేటెడ్ సభ్యులుగా ఉన్నారు.

మళ్లీ వైరస్ టెన్షన్

... 5వ పేజీ తరువాయి

ఫ్లూ మాదిరిగా వచ్చి తగ్గుతుందని పేర్కొంటున్నారు. బ్రాంకైటిస్, న్యుమోనియా, ఆస్తమా ఉన్న వారిలో తీవ్రత కొంత ఎక్కువగా ఉంటుందంటున్నారు. మాస్క్ ధరించడం, చేతులను శుభ్రం చేసుకోవడం కీలకమని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలని చెబుతున్నారు.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. జాగ్రత్తలు అవసరం

దేశంలో కూడా కేసులు నమోదైన నేపథ్యంలో కొంత అప్రమత్తంగా ఉండడం అవసరం. ఈ వైరస్ కూడా కరోనా జాతికి చెందినదే. ఇది అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా పిల్లల్లో, 65 ఏళ్లు దాటిన వారిలో దీని వ్యాప్తి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికిప్పుడు ఈ వైరస్ ప్రమాదకర స్థాయిలో వ్యాప్తి చెందే అవకాశం లేదు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వైద్యుల సూచనల మేరకు నడుచుకోవాలి. పానిక్ కావద్దు. అనుమానాలు, భయాలను పెట్టుకోవద్దు.

- డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

ప్రధాని సభకు చకచకా ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఏడు వేల వాహనాలు వినియోగించనున్నారు. సభకు వచ్చే జనం కోసం మూడు లక్షల ఫుడ్‌ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి బహిరంగ సభకు వచ్చే వారి కోసం 1.1 లక్షల ప్యాకెట్లు బస్సులు/వాహనాలు బయలుదేరే పాయింట్లకు పంపుతారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చే వారికి నాతవలస టోల్‌గేట్ వద్ద 15 వేల ప్యాకెట్లు అందిస్తారు. అనకాపల్లి నుంచి వచ్చే వారికి 40 వేలు, విజయనగరం జిల్లా నుంచి వచ్చే వారికి 15 వేల ప్యాకెట్లు ఆయా జిల్లాల అధికారులు బస్సుల్లోనే అందించనున్నారు. సభ అనంతరం తిరిగి వెళ్లేప్పుడు పంపిణీ చేసే నిమిత్తం విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారికి 1.25 లక్షలు, విజయనగరం, అనకాపల్లి నుంచి వారికి 55 వేల ఆహార ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. ఇవి కాకుండా ప్రత్యామ్నాయంగా అనకాపల్లి నుంచి వచ్చే వారికి అగనంపూడి టోల్‌గేటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చే వారికి రాజాపులోవ సమీపాన అవంతి కళాశాల, అడవివరం జంక్షన్ వద్ద అందించేందుకు 20 వేల స్నాక్స్ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. కాగా రోడ్ షోలో పాల్గొనే 70 వేల మందికి స్నాక్స్ పంపిణీ చేయాలని భావించారు. అయితే ప్రధాని భద్రతను పర్యవేక్షించే ఎస్పీజీ అధికారులు అనుమతి ఇవ్వనందున వాటి పంపిణీ రద్దు చేశారు.

ప్రధాన వేదిక వరకూ రోడ్‌షో

ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభా వేదిక వరకూ రోడ్‌షో నిర్వహించనున్నారు. దీనిపై ఇంతవరకూ అధికారికంగా స్పష్టత రాకపోయినా సోమవారం వేదిక ముందు ప్రాంగణం మధ్య నుంచి తారురోడ్డు వేశారు. దీనిని బట్టి రోడ్డు షో ఏయూ ఎకనామిక్స్ విభాగం ఎదురుగా గల వెంకటాద్రి వంటిల్లు వద్ద నుంచి ప్రారంభమై త్రీటౌన్ జంక్షన్, ఏయూ మహిళా మీదుగా వేదిక వరకూ సాగుతుందని భావిస్తున్నారు. వెంకటాద్రి వంటిల్లు నుంచి రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు నిర్మించారు. కాగా ప్రధాని పర్యటించే ప్రాంతంలో ఎస్పీజీ అధికారు లు తనిఖీలు ముమ్మరంచేశారు.

ఐటీ కంపెనీలను జగనే తెచ్చారట!

... 5వ పేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. అలాగే భోగాపురంలో విమానాశ్రయం నిర్మాణానికి 2019లోనే సీఎంగా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ విమానాశ్రయాన్ని కూడా జగన్మోహన్‌రెడ్డి తీసుకువచ్చినట్టు అమర్ చెప్పుకున్నారు.

అదేవిధంగా రుషికొండపై ప్యాలెస్‌ను జగన్ రూ.500 కోట్లతో సొంతం కోసం నిర్మించుకోలేదని అమర్ అడ్డగోలుగా మాట్లాడారు. నాటి సీఎం జగన్ తన నివాసం కోసం సముద్ర తీరాన ఆ ప్యాలెస్ నిర్మించారని అందరికీ తెలుసు. ఇప్పుడు దానిని ప్రధాని, రాష్ట్రపతి విడిది కోసం ఉపయోగించుకోవాలని అమర్ ఓ సలహా కూడా పారేశారు. ప్రధాని, రాష్ట్రపతి విశాఖపట్నం వస్తే కొన్ని గంటల్లోనే ఇక్కడి కార్యక్రమం చూసుకొని వెళ్లిపోతారు. అంత ఎందుకు బుధవారం ప్రధాని మోదీ విశాఖపట్నం వస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు దిగి తిరిగి రాత్రి 7 గంటలకు బయల్దేరి వెళ్లిపోతున్నారు. ఇలా మూడు, నాలుగు గంటలు ఉంటే వీవీఐపీల విడిది కోసం రూ.500 కోట్ల భవనం ఏడాది పొడవునా ఖాళీగా ఉంచాలా?...ఇదేనా ప్రజాధనం పట్ల బాధ్యత..? అని అమర్‌నాథ్ మాటలపై విశాఖ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.



ఉదయం 7.30 గంటల సమయంలో హనుమంతవాక జంక్షన్‌లో మంచు

పొగమంచుతో అవస్థలు

ఆరిలోవ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ప్రాంతంలో దట్టంగా పొగమంచు కురుస్తోంది. మంచుతో ఈ ప్రాంతం కమ్ముకోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఉదయం దారి కూడా కనిపించని పరిస్థితి ఉంటోంది. వాహనదారులు నెమ్మదిగా ముందుకు వెళ్లవలసి వస్తోంది. దీనికితోడు చలి పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మంచు తీవ్రత వల్ల కొందరికి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. తప్పనిసరిగా తలకు మంకీక్యాప్ ధరిస్తున్నారు.

'క్రీడల్లో రాణించాలి'



విద్యార్థులతో ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు చెప్పారు. జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను కళాశాలలో సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందన్నారు. క్రీడల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులకు తమ ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఫిజికల్ డైరక్టర్ వి. సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎండాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తలకు తీవ్ర గాయం కావడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కల్లూరి శ్రీను సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పీఎంపాలెం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. మధురవాడ వాంబే కాలనీలో నివాసం ఉంటున్న కల్లూరి శ్రీను (38) పూల అలంకరణ పని చేస్తుంటాడు. ఈనెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చాడు. మరుసటి రోజు తెల్లవారుజామున ఐదు గంటలకు కింద పడిపోయి ఉండడంతో తలకు గాయమైనట్టు కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
● **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
● **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 46, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 46, బీరకాయలు 52,ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 18, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయ 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 60, కీరదోస 36,కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 44, కొండ ఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

'భోజనం'తో ఇంటర్ విద్యార్థుల్లో ఆనందం

» తగ్గిన ఆకలి బాధలు, అదనపు ఖర్చు
» పెరగనున్న ఉత్తీర్ణత శాతం

మద్దిలపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల ఆకలి తీర్చడం ద్వారా హాజరుశాతం, ఉత్తీర్ణత శాతం పెంచడం, ఆయా కుటుంబాలకు ఉపశమనం కలిగించడం అనే బహుళ ప్రయోజనాలను కాంక్షించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంతో ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ నెల 4 నుంచి అమలు చేసిన ఈ పథకం మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ కళాశాలలో 912 మంది విద్యార్థుల కడుపు నింపుతోంది. ఈ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నగర పరిధి మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రాంతాలు. పక్క జిల్లాల విద్యార్థులు సైతం ఇక్కడ చదువున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాల తరగతులు కొనసాగడంతో మధ్యాహ్నం విద్యార్థులు ఆకలితో ఉండేవారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఉదయం 7 గంటలకే ఇళ్ల వద్ద బయలుదేరాల్సి రావడంతో క్యారేజీలు కూడా తెచ్చుకునే అవకాశం ఉండేది కాదు. ఉదయం తీసుకున్న అల్పాహారంతోనే రోజంతా కళాశాల గదుల్లో ఆకలితో ఉండేవారు. 2018లో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన మధ్యాహ్న భోజనం పథకం వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దు చేశారు. దీంతో అయిదేళ్ల విద్యార్థులకు భోజనం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం రాగానే విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ఇంటర్మీడియట్ విద్యార్థులపై దృష్టి సారించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరు నమోదు, ఉత్తీర్ణత శాతం మెరుగుపరచడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ఇంటర్ విద్యార్థులకు ఆకలి లేని చదువులు అందితేనే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని భావించి మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారు. యవ్వన దశ కావడంతో విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించడానికి చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఠంచనుగా భోజనం పెట్టడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వీఎస్ కృష్ణ కళాశాలలో భోజనం చేస్తున్న బాలికలు

రోజూ మెనూ ఇలా...

సోమవారం: కూరగాయల పలావ్, కోడిగుడ్డు కూర, వేరుశనగ, బెల్లం చిక్కి.
మంగళవారం: పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు, రాగిజావ.
బుధవారం: కూరగాయల అన్నం, ఆలుకుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కి.
గురువారం: సాంబార్ బాత్, లెమన్ రైస్, టమోట పచ్చడి, ఉడికించిన కోడ్డు.
శుక్రవారం: అన్నం, ఆకుకూర, పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, బెల్లం చిక్కి.
శనివారం: ఆకుకూర అన్న, పప్పుచారు, రాగిజావ, స్వీట్ పొంగల్.

పల్లె నుంచి రావడం కష్టంగా ఉండేది



సమయానికి కళాశాలకు రావాలంటే ఉదయం 7 గంటలకు ఇంటి వద్ద బయలుదేరాలి. అంతా ఉదయం క్యారేజీ పట్టుకోవాలంటే వంట అయ్యేది కాదు. సైన్స్ గ్రూప్ కావడంతో తరగతులకు అందనేమోనని ఒక్కో రోజు టిఫిన్ కూడా చేయకుండా కళాశాలకు రావాల్సి వచ్చేది. ఇప్పుడు ఇబ్బంది లేదు.

- ఎం.రాధిక బైపీసీ, కొత్తవలస, విజయనగరం జిల్లా

రోజూ రూ.100 ఖర్చు కష్టమని..



ఉదయం 7 గంటలకు కళాశాలకు బయలుదేరుతాను. ఆ సమయంలో టిఫిన్ కూడా ఉండదు. మధ్యాహ్న భోజనం చేయాలంటే రూ.100 ఉండాలి. అందుకే ఆకలితో ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఆకలి సమస్య పోయింది.

-ఎం.హరీష్ బైపీసీ, భీమిలి.

శక్తి సన్నగిల్లేది



మా ఊరి నుంచి కళాశాలకు రావాలంటే ప్రయాణ సదుపాయం చాలా తక్కువ. అడవుల్లో ఉన్నందున ఉదయమే అడవివరం వచ్చి బస్ ఎక్కితే 9 గంటలకు చేరుకుంటాను. ఆకలితో రోజంతా ఉండడం రెండు వైపుల ప్రయాణంతో శక్తి సన్నగిల్లేది. మధ్యాహ్న భోజనంతో ఆకలి పోయి ఉత్సాహం వస్తుంది. **పి.మేఘన బైపీసీ, దబ్బంద అడవివరం.**

హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ టెర్రర్

కానరాని పోలీసులు
వాహనాల తోరణంతో ప్రయాణ కష్టాలు

ఆరిలోవ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హనుమంతవాక జంక్షను పేరు చెబితే చాలు.. వాహనదారులు, ప్రయాణికులు జడుసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. పెరిగిన వాహన వినియోగంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ నుంచి వాహనాలు వెళ్లాలంటే కనీసం పది నిమిషాలు వేచి ఉండవలసి వస్తుంది. వెంకోజీపాలెం నుంచి ఆదర్శనగర్ వరకు వాహనాలు నిలిచిపోతుంటాయి. ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో వాహనాలు గూడ్సు రైలును తలపిస్తుంటాయి.పాదచారులు వెళ్లడం కూడా కష్టంగా ఉంటోంది. రాకపోకలకు మార్గం సుగమం చేయడం పోలీసులకు శక్తికి మించిన పనిలా ఉంది. సింహాచలం, వెంకోజీపాలెం, జంతుప్రదర్శన శాల, విశాలాక్షి నగర్‌ల నుంచి నలువైపులా ఈ జంక్షన్ గుండానే రాకపోకలు సాగుతుంటాయి. కొద్దిమంది మాత్రం బీచ్ రోడ్డులో వెళ్తుంటారు. నిర్దీత సమయంలో ఇక్కడ నుంచి జంక్షన్‌ను దాటడం కష్టమే. ఒక్కసారి వచ్చి ఆగిన వాహనాలు ఒకేసారి ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. అందువల్ల ఎక్కువ సమయం పడుతోంది. ఉదయం 7 నుంచి 10 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 వరకు విద్యాసంస్థలు, కార్యాలయాలకు వెళ్లి వచ్చే వారితో ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఆ తరువాత కూడా నగరంలోకి వ్యాపారం, ఇతర పనులపై వచ్చే వారు, ఆర్టీసీ బస్సులతో కిక్కిరిసిపోతుంది. భోగాపురం విమానాశ్రయం ప్రారంభించేలోగా ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తికాకుంటే భవిష్యత్తులో రాకపోకలు ఊహలకే అందనంత భారంగా కనిపిస్తోంది. సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ఇతర సిబ్బంది రంగంలోకి దిగితే తప్ప ట్రాఫిక్‌ను క్లియర్ చేయలేకపోతున్నారు. సంక్రాంతి పండుగ కారణంగా గత పది రోజులుగా పరిస్థితి తీవ్రంగా ఉంటోందని సీఐ అన్నారు. ఏటా పెద్ద సంఖ్యలో కొత్త వాహనాలు రోడ్డెక్కడంతో ట్రాఫిక్ పద్మవ్యూహంలో అందరూ చిక్కుకోవలసి వస్తోంది.



జంక్షన్‌లో బారులు తీరిన వాహనాలు



ప్రధాని సభను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ వార్డుల నుంచి హాజరైన కార్పొరేటర్లు, నాయకులతో ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ బహిరంగ సభకు, ర్యాలీలోనూ పార్టీ శ్రేణులు పాల్గొనాలన్నారు. ప్రతి వార్డు నుంచి నాయకులు, కార్యకర్తలు సభ విజయవంతానికి కృషి చేయాలని,ప్రజలు భారీగా ప్రధాని సభలో పాల్గొనేలా చూడాలని కోరారు.ప్రధాని సభను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. ప్రధాని రాక సందర్భంగా ఉత్తరాంధ్రలోని పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారని, అందుకు కృతజ్ఞతగా భారీగా జనం హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సమావేశంలో వివిధ వార్డుల టీడీపీ అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలు, నాయకులు పాల్గొన్నారు.

తొలగనున్న ఏయూ ఉద్యోగుల ఇబ్బందులు

యూనివర్సిటీ ఉద్యోగుల ఇబ్బందులు త్వరలోనే సమసిపోతాయని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్ర యూనివర్సిటీ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఉద్యోగులు రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో యూనివర్సిటీ ఉద్యోగులు బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ యూనివర్సిటీ సంక్షేమం, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని అన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు పీతల అమరేంద్ర, ఒమ్మి నూకరాజు, బండారి దేముడు, చిరంజీవి, గణేష్, యాసిన్ బాబా, పీతల వెంకటరావు,రమేష్, గణేష్, సాయిబలరాం, పైడిరాజు, రామారావు, కుమార్, రవికిరణ్, దావీదు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఈ బార్‌కు ఏ వేళలో వచ్చినా మద్యం లభ్యం

» పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
» మందుబాబులతో మహిళలకు ఇబ్బందులు



ఉదయాన్నే దుకాణం వద్ద జరుగుతున్న అమ్మకాలు

వెంకోజీపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మందుబాబులకు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్ షాప్‌ల వద్ద, రాత్రి 11 గంటల వరకు బార్‌ల వద్ద మద్యం లభిస్తుంది. కానీ ఇక్కడ బార్‌లో మాత్రం 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు దుకాణంలో నేరుగా లభిస్తుంది. ఆ తరువాత వెనుక ఉన్న గదిలో తలుపు కొడితే చాలు..మద్యం ఇస్తారు. కొనుగోలుచేసుకుని వెళ్లిపోవడమే కాదు...ఇక్కడే మద్యం తాగి వెళ్లవచ్చు. ఇదీ హెచ్‌బీ కాలనీలోని సంధ్యా బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాకం. ఈ బార్‌కు దగ్గరలోనే ఎక్సైజ్ కార్యాలయం కూడా ఉంది. అయినా జంకు లేకుండా మద్యాన్ని 24 గంటలూ అందుబాటులో ఉంచుతున్నారు. రోజూ ఉదయాన్నే బడికి వెళ్లే చిన్నారులు, వారిని తీసుకెళ్లే తల్లులు ఈ బార్ వద్దనే నిల్చుని స్కూల్ బస్సు కోసం ఎదురుచూస్తారు. మద్యం బాబులతో వీరు ఒక్కోసారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకులపై చర్యలు తీసుకుని చిన్నారులకు, మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



రహదారిపై నిలిపివేసిన వాహనాలు



బస్ షెల్టర్ వద్ద నిలిపి ఉన్న వాహనాలు

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

ఎంవీపీ కాలనీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ సర్కిల్ సమీపంలో ఉన్న రహదారిపై వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేస్తున్నారు. దీని వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక్కడ కొత్తగా ఓ హోటల్ ఏర్పాటు చేశారు. కొత్త కదా జనం ఎగబడుతున్నారు. అక్కడ బిర్యానీ కోసం క్యూ కడుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది. కానీ ఆ జనంతో వచ్చే చిక్కులు ఆ దారి వెంట ప్రయాణం చేసేవారిని వెంటాడుతున్నాయి. ఆ హోటల్‌కు ప్రత్యేకించి బయట స్థలమేదీ లేదు. దీంతో జనం రోడ్డు పైనే క్యూకడుతుండగా, వారి వాహనాలు రోడ్డు పక్కన పార్కింగ్ చేయడంతో సగం రోడ్డు వాటికే సరిపోతోంది. దారి వెంట ప్రయాణించే వాహనదారులకు చాలా ఇబ్బంది ఎదురవుతోంది. ట్రాఫిక్ పోలీసులూ లేరు,కనీసం సదరు హోటల్ సిబ్బంది కూడా ఈ పరిస్థితిని సరిదిద్దకపోవడంతో అమ్మినోళ్లు, కొన్నోళ్లు బాగానే ఉన్నారు.. మధ్యలో మాకేంటి ఈ తంటా అని ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు.

16వ బెటాలియన్‌లో సీపీకి సన్మానం

కొమ్మాది, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే పోలీసులకు క్రీడల వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఉల్లాసం కలుగుతుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. బక్కన్నపాలెం 16వ పోలీస్‌బెటాలియన్‌లో సోమవారం క్రీడా వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా వారు మాట్లాడారు.బెటాలియన్ సిబ్బందికి ఎప్పటికప్పుడు ఆయుధ పని తీరు, వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సిబ్బంది బైక్ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీ కృష్ణ, ఏపీఎస్‌పీ బెటాలియన్ ఐజీ రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.



సీపీ బాగ్చీని సన్మానిస్తున్న కమాండెంట్ మురళీ కృష్ణ

మేయర్ గారూ.. ఇంకా జగనే ముఖ్యమంత్రా ?



మేయర్ క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం జగన్ చిత్రం

ఆరిలోవ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) :వైసీపీ నాయకులు తమ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి చిత్రాలను వ్యక్తిగత, పార్టీ కార్యక్రమాల్లో పెట్టుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి క్యాంపు కార్యాలయంలో నేటికీ జగన్ ముఖ్యమంత్రిగా, వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ చైర్మన్‌గా చిత్రాలు ప్రదర్శించడం సందర్శకులకు విస్తుగొలుపుతోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టి దాదాపు ఎనిమిది నెలలు కావస్తోంది. టీటీడీకి కొత్త చైర్మన్ కూడా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. కానీ మేయర్ అధికారిక నివాసంలో బాధ్యులకు ఇంకా ఈ విషయం తెలిసినట్టు లేదు. మేయర్ క్యాంపు కార్యాలయానికి జనవరి 1న పలువురు అధికారులు వచ్చి శుభాకాంక్షలు తెలిపి వెళ్లారు. సందర్శకులకు ఎదురుగానే కనిపిస్తున్న ఈ చిత్రాలు, హోదాలు మార్చాలన్న సలహా అధికారులు ఇచ్చినట్టు లేదు. ఒకవేళ సలహా ఇచ్చినా మేయర్ ఎందుకు పాటించలేదో తెలియడం లేదు.

బాలల హక్కుల పరిరక్షణకు భరోసాగా నిలవండి



సంస్థ లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

వెంకోజీపాలెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణకు శతశాతం భరోసాగా నిలవాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నూతన బాలల హక్కుల పరిరక్షణ చైతన్య ఫోరం (న్యూ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ అవేర్నెస్ ఫోరం) పేరిట ప్రభుత్వ రిజిస్ట్రేషన్ లాంఛనాలు పూర్తి చేసుకున్న ఈ సంస్థ ప్రతినిధులు సోమవారం ఆమదాలవలసలోని తమ్మినేని స్వగృహంలో సంస్థ పేరుతో లోగో ఆవిష్కరింపజేశారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ బాలలపై రాష్ట్రంలో నిత్యం వెలుగులోకి వస్తున్న దాడులు, లైంగిక చర్యలను గమనిస్తే వారి సంక్షేమానికి పోరాటం చేసేందుకు ఇలాంటి సంస్థలు ముందుకు రావలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, నూతన ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి. ధనలక్ష్మి, తమ్మినేని చిరంజీవి నాగ్, కిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

9న విశాఖ నివాస హక్కుల పోరాట దినం



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

సిరిపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం విశాఖ నగర కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 9న విశాఖ నివాస హక్కుల పోరాట దినం నిర్వహిస్తున్నట్టు పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తెలిపారు.సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో 'వర్తమానంలో నివాస హక్కుల ఉద్యమ సవాళ్లు-కర్తవ్యాలు' కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9న ఉదయం 10 గంటలకు రైల్వే న్యూకాలనీ సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక హైకోర్టులో ప్రముఖ న్యాయవాది జేవీ చలపతిరావు ప్రారంభోపన్యాసం చేస్తారన్నారు. వక్తలుగా రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి, బానాస రాష్ట్ర నాయకుడు టి.శ్రీరామ్మూర్తి, దళిత విముక్తి,ఎస్‌వీ రమణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, కె.వి.కె.నిర్మల, కె.వి.రమణ తదితరులు ప్రసంగిస్తారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సదస్సు స్థలం నుంచి జీవీఎంసీ కమిషనర్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తామన్నారు. 2012లో జరిగిన పోరాటానికి గుర్తుగా 9న నివాస హక్కుల పోరాట దినంగా పాటిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట లక్ష్మి, డీకేఎస్ రోహిణి దేవి, ఎంఎన్‌ఎస్‌ఎస్ నగర కన్వీనర్ లక్ష్మి, కో-కన్వీనర్ పరదేశి, కె.బాల నాగమ్మ, కె.రామారావు, బి.భూషణం తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరాంధ్ర అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు'

రామ్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. సోమవారం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాని వస్తుండడం శుభపరిణామమని అన్నారు. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర అత్యంత వెనుకబాటుతనానికి గురవుతోందని, రాష్ట్ర విభజన హామీలలో ఒక్కటీ అమలు కాలేదన్నారు. అమరావతికి దీటుగా ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, పరిశ్రమలలో స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ప్రకటించి, వలసలు అరికట్టాలని కోరారు. సమితి నాయకులు పెదిరెడ్ల సత్యం, రాజ్‌కుమార్, పి.శ్రీనివాసరావు, పైడం నాయుడు, పట్నాయక్, సూర్యారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ విద్యలతో బాలికలకు రక్షణ



స్వీయరక్షణపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఆరిలోవ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై లైంగిక దాడుల నిరోధానికి కరాటే, కుంగ్ ఫూ వంటి యుద్ధ విద్యలు నేర్చుకుంటే స్వీయరక్షణ పొందవచ్చని జేసీఐ ప్రాజెక్టు డైరక్టర్ సాయిలక్ష్మి అన్నారు.విద్యార్థినులకు స్వీయరక్షణపై సోమవారం తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జేసీఐ విశాఖ స్వచ్ఛంద సంస్థ సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు ఏవిధంగా ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి ? అత్యవసర పరిస్థితుల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలి? అనే అంశాలపై మెలకువలు తెలిపారు. నేడు బాలికలకు, మహిళలకు రక్షణ లేని పరిస్థితుల్లో గుండె ధైర్యంతో ఎదుర్కోవలసిన విధానాన్ని విద్యార్థినులకు ఆమె వివరించారు. మంచి, చెడు స్పర్శ (గుడ్ టచ్, బ్యాడ్ టచ్)లను వివరించారు. మానసిక ఆనందం కలిగించే క్రీడలపై కూడా దృష్టి నిలపాలని సూచించారు. ఆర్మీ మాజీ ఉద్యోగి, పీఈటీ మహేశ్వరరావు మార్గనిర్దేశకులుగా వ్యవహ రించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ హెచ్.జి.ఎఫ్. కిరణ్ పోలిపిల్లి, జేఎఫ్ఎం సంతోష్ నెమ్మాని, అన్నెపు ఆదిత్యసాయి, ప్రధానోపాధ్యాయిని గరిమెళ్ల దుర్గాభవాని, 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి వ్యక్తికి గాయాలు

ఎండాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. పీఎంపా లెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తాటిపూడి రాము సీలింగ్ పని చేస్తుంటాడు. సోమవారం లా కళాశాల రోడ్డు నుంచి పీఎంపాలెం కూడలి వైపు బైక్‌పై వెళతుండగా అదుపు తప్పి బోల్తా పడడంతో గాయాలయ్యాయి. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్స్‌లో నేటి నుంచి హస్త కళాకారుల వస్తు ప్రదర్శన

మహారాణిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహారాణిపేట పరిధిలోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్‌లో మంగళవారం (నేటి) నుంచి 11 వరకు ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ హస్త కళాభివృద్ధి సంస్థ ఎండీ శ్రీవిశ్వ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో హస్త కళాకారులు తయారు చేసిన కళాఖండాలను విక్రయిస్తారని తెలిపారు. శ్రీకాళహస్తిలోని పెన్‌కలంకారీ పెయింటింగ్, కడపకు చెందిన అరటినార ఉత్పత్తులు, మన్యం జిల్లాలోని సవర ఆదివాసీల పెయింటింగ్‌లు, ఏటికొప్పాక లక్కబొమ్మలు ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. చేతివృత్తి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

రక్షణ గోడ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న శ్యామలా, కామేశ్వరి

కంచరపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు పెదకొత్తూరులో ప్రధాన గెడ్డకు సోమవారం మరమ్మతులు ప్రారంభించారు. ఇక్కడ గెడ్డకు రక్షణ గోడ (రిటెయినింగ్ వాల్) లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. గోడ మరమ్మతుల నిమిత్తం రూ.19.85 లక్షలు మంజూరు కావడంతో బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి పాల్గొని పనులను ప్రారంభించారు. ఏఈఈ అర్చన, గురువోజీ పాల్గొన్నారు.

నగర వీధుల్లో హరిదాసు కీర్తనలు



అక్షయపాత్రలో బియ్యం వేస్తున్న భక్తులు

సీతమ్మధార, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో రోజూ హరిదాసులు తుంబుర వాదనతో శ్రీరామకీర్తనలు పాడుతూ సీతమ్మధార ప్రాంతంలోని అన్ని వీధుల్లో తిరుగుతున్నారు. స్థానిక ప్రజలు హరిదాసును ఆహ్వానిస్తున్నారు. భక్తి పాటలు, కీర్తనలు పాడుకుంటూ వీధిలో సంచరిస్తుండగా మహిళలు బయటకు వచ్చి హరిదాసు తలపై ఉన్న అక్షయ పాత్రలో బియ్యం (స్వయం పాకం) వేసి సంప్రదాయ పద్ధతులను కొనసాగిస్తున్నారు.

ఏఐపీఏ ముఖ్య సలహాదారుగా నరవ ప్రకాశరావు నియామకం



ఒడిశాలో నియామక పత్రాన్ని అందుకుంటున్న నరవ ప్రకాశరావు

డాబాగార్డెన్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ (ఏఐపీఏ) మూడో జాతీయ సమావేశం ఈ నెల 4, 5 తేదీల్లో ఒడిశాలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి నగరానికి చెందిన నరవ ప్రకాశరావు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రకాశరావును ఏఐపీఏ ముఖ్య సలహాదారుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మూడేళ్లు ఈ పదవిలో కొనసాగుతారు. విద్య, వైద్యం పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీలో ఉండాలని, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్న జాతీయ విధానం-2020 మార్చాలని తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు నరవ ప్రకాశరావు తెలిపారు.

ఎంపీ శ్రీభరత్‌కు టీడీపీ నేతల సన్మానం

మహారాణిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎంపీ శ్రీభరత్ సారథ్యంలో విశాఖ అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని స్థానిక టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ నాయకులు ఎంపీ భరత్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమై నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. ప్రతీ కార్యకర్త ఇంటిలో ఆనందం వెల్లివిరియాలని ఎంపీ ఆకాంక్షించారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు నజీర్, గొంప ధర్మారావు, పీవీ వసంతరావు, నమ్మి రవికుమార్, భరణికాన రాజు ఉన్నారు.

జిల్లా ఓటర్లు 20,15,934

... 5వ పేజీ తరువాయి

ఓటర్లు 23,292 మంది ఉన్నారు. ఆ తరువాత 1,549 మంది కొత్తగా ఓటు నమోదు చేయించుకోవడంతో వారి సంఖ్య 24,841కు పెరిగింది.

ఇదిలావుండగా జిల్లాలో 3,610 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 3,494, మహిళలు 116 మంది ఉన్నారని కలెక్టర్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితాను జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి/తహసీల్దారు కార్యాలయాలు, అన్ని పోలింగ్ బూత్‌లలో అందుబాటులో ఉంచామన్నారు.

ప్రధాని రాకతో నగరానికి నగిషీలు



మాధవధారలో డివైడర్లకు రంగులు అద్దుతున్న సిబ్బంది



కాన్వెంటు కూడలిలో పార్కును శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

మురళీనగర్/జ్ఞానాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న నగరానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగంలో హడావుడి ఎక్కువైంది. నగర పాలక సంస్థ సిబ్బందితో కలసి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం శుభ్రతకు పెద్దపీట వేస్తోంది. సోమవారం ఒక్కసారిగా ఉరుకులు, పరుగులతో సిబ్బంది పలు పనుల్లో నిమగ్నమయ్యారు. ఎయిర్‌పోర్టు దాటాక మోదీ పర్యటన ఉండే రోడ్డు మార్గాన్ని సుందరీకరిస్తున్నారు. దెబ్బతిన్న హైవే డివైడర్లను ఇంజనీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో మరమ్మతులు చేపట్టి, రంగులు అద్దుతున్నారు. జీవీఎంసీ నిర్వహణలోని పచ్చదనాన్ని మరింత మెరుగ్గా తయారు చేయడానికి ఆపసోపాలు పడుతున్నారు. హైవే నాలుగు రోడ్ల మధ్య ప్రధాన డివైడరు సహా, నాలుగు లైన్ల సర్వీసు రోడ్డుకి ఇరువైపులా ఉన్న పచ్చదనం, రక్షణ కంచెలకు మరమ్మతులు చేపడుతున్నారు. నగరంలోకి ప్రవేశించాక ఎన్ఏడీ జంక్షన్, ఆర్ అండ్‌బీ, బిర్లా జంక్షన్ దాటి ఊర్వశి, తాటిచెట్లపాలెం వరకు సుందరీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. జీవీఎంసీ జోన్-5 అధికారులు స్థానిక సిబ్బందితో కలసి అత్యవసర పనులు చేయిస్తున్నారు. కాన్వెంట్ జంక్షన్ వద్ద ఎక్కడపడితే అక్కడ రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చుతున్నారు. డివైడర్లకు రంగులతో ముస్తాబు చేస్తున్నారు. రహదారికి ఇరువైపులా పచ్చతివాచీలు పరుస్తున్నారు. ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. కాన్వెంటు కూడలిలో జీవీఎంసీ జోన్-4, జోన్-5 పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బంది కలసి ఆ రోడ్లపై చెత్త చెదారాన్ని తొలగించారు. కాన్వెంటు కూడలి నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్లపై గుంతలు పూడ్చారు. పనులను జడ్సీ మల్లయ్యనాయుడు, బి.రాము, ఈఈ ప్రసన్నరెడ్డి, సహాయ వైద్యాధికారులు సునీల్‌కుమార్, కృష్ణంరాజులు పర్యవేక్షించారు.

మోదీ పర్యటనను జయప్రదం చేయాలి: విష్ణుకుమార్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, చిత్రంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు

సీతమ్మధార, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు ఐక్యంగా అందరూ పాల్గొనాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పిలుపునిచ్చారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ప్రధాని పర్యటనకు ప్రజల తరలింపు, ఇతర ఏర్పాట్లపై సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌ను ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొలమరశెట్టి శ్రీనివాస్, జోనల్ కమిషనర్ రాము, ఏపీడీ పుణ్యవతి, కూటమి నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌తో రైల్వే జోన్ ప్రారంభించాలి


» అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు చలసాని గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న చలసాని గాంధీ

డాబాగార్డెన్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వాల్తేర్ డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ తక్షణమే ప్రారంభించాలని అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు చలసాని గాంధీ కోరారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధేయ మార్గంలో రైల్వే జోన్ సాధించడం దేశ చరిత్రలోనే గొప్ప పోరాటంగా నిలిచిపోతుందన్నారు. రైల్వేజోన్ సాధనలో మీడియా, కార్మిక సంఘాలు, ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. విపక్షకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఆందోళన రైల్వే కార్మిక సంఘాలు, ప్రధానంగా మీడియా, ప్రజాప్రతినిధుల కీలక పాత్రతో ఉద్యమ రూపుదాల్చి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభోత్సవానికి దారి తీసిందన్నారు. గౌతు లచ్చన్న, భాట్టం శ్రీరామ్మూర్తి, ద్రోణంరాజు సత్యనారాయణ, కింజరాపు ఎర్రన్నాయుడు, ఎంవీవీఎస్ మూర్తిలు అనేక విధాలుగా రైల్వేజోన్ కోసం కృషి చేశారన్నారు. రాష్ట్రంలో వాల్తేర్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లుకు కలిపి ఒక ప్రత్యేక జోనల్ హెడ్ క్వార్టర్స్ విశాఖపట్నంలో ఉంటుందన్నారు. వెంటనే కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. జోన్ ప్రారంభోత్సవం కాగానే కార్యకలాపాలు ప్రారంభించడానికి అవసరమైన భవనాలు ఇప్పటికే విశాఖలో సిద్ధంగా ఉన్నాయన్నారు. సాధించవలసిన ఇతరఅంశాలపై ఉమ్మడి పోరాటం చేయాలని గాంధీ పేర్కొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ



ఎన్‌సీసీ క్యాడెట్లకు పరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

అక్కయ్యపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ అంటే క్రమశిక్షణకు మారుపేరని ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ ఎంఎస్‌వీ విశ్వనాథం అన్నారు. ఆంధ్రా జూనియర్ డివిజన్ వింగ్, జూనియర్ డివిజన్ క్యాడెట్లకు సోమవారం ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు. దీనికి 26 మంది క్యాడెట్లు హాజరయ్యారు. రెండేళ్లపాటు మిలటరీ డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ ట్రైనింగ్ ఇచ్చారు. 80 తరగతులు, 24 పీరియడ్లలో శిక్షణ పొంది, పది రోజులు ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లకు ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 125 మార్కులలో 50 శాతం పొందాలని విశ్వనాథం తెలిపారు. మార్చి 3న జాతీయ స్థాయిలో రాత పరీక్ష ఉంటుందని, ఇందులోనూ 50 శాతం మార్కులు రావాల్సి ఉంటుందని చెప్పారు. సి గ్రేడ్ 65, బి గ్రేడ్ 79, ఎ గ్రేడ్ 80కి పైగా శాతం మార్కులు సాధించాలని పేర్కొన్నారు. 50 శాతం కంటే తక్కువ మార్కులు పొందిన వారు ఎన్‌సీసీ సర్టిఫికేట్ పొందేందుకు అర్హత కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ హవల్దార్లు ఏఎస్ బదూరియా, తమ్మారియా పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లను ఆంధ్రా కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయ్‌కుమార్, సుబేదార్ మేజర్ జయప్రకాష్, ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ నరస అభినందించారు. ఈ కార్యక్రమంలో క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పోర్టులో కార్మికులకు ఉపాధి అవకాశాలు



అతిథుల సత్కార కార్యక్రమంలో కార్మికులు

అక్కయ్యపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల పాటు తమ జీవనోపాధి కోసం పోరాడిన విశాఖపట్నం పోర్టు క్యాజువల్ కార్మికుల కల ఎట్టకేలకు నెరవేరింది. క్యాజువల్ కార్మికులకు పోర్టులో ఉపాధి కల్పిస్తూ చైర్మన్ అంగముత్తు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం నరసింహనగర్ రైతుబజారు సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలిండియా పోర్టు, డాక్ వర్కర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు డీకే శర్మ ప్రసంగించారు. అనంతరం అతిథులను కార్మికులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోర్టు ట్రస్ట్ ట్రస్టీ అంజిబాబు, వివిధ సంఘాల నాయకులు మంగయ్య నాయుడు, ఎం.కోటేశ్వరరావు, గంట్ల శ్రీనుబాబు, కేఎస్ వర్మ, గుండు అప్పలరాజు, బాలు, నాయుడు పాల్గొన్నారు.

బోరింగ్‌ను కప్పేసిన చెత్త!



కంచరపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు పరిధి రెడ్డి కంచరపాలెం బసవవారివీధిలో చెత్తచెదారాలు పేరుకుపోతున్నాయి. వీధిలో బోరింగ్ వద్ద చెత్తను కుప్పలుగా వేయడంతో మంచినీరు కోసం వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. ప్రజలకు నిత్యం ఇక్కడ ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత సిబ్బంది చెత్తను ఇలా తరలించగానే, మళ్లీ వెంటనే వీధుల్లో కూడళ్ల వద్ద, మలుపుల వద్ద వేస్తుండడంతో అపారిశుధ్యం నెలకొంటోంది. .ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రెడ్డి కంచరపాలెంలోని బసవవారి వీధిలో బోరింగ్‌ను కప్పేసిన చెత్త

మాధవధార ఉడా కాలనీలో సమస్యాత్మక వ్యర్థాల తొలగింపు



పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

మాధవధార, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తరంలోని 51వవార్డు మాధవధార ఉడాకాలనీలో నెలల తరబడి పేరుకున్న డెబ్రిస్ గుట్టల్ని సోమవారం తొలగించారు. 48ఎ బస్ రూట్‌లోని బస్టాప్ పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలు, స్థానికులు కాల్వల్ని ఆక్రమించి పోగుచేస్తున్న చెక్కల నిల్వల్ని 286 శానిటేషన్ సెక్రటరీ భాస్కర్ సిబ్బంది సాయంతో తొలగించారు. నివాసిత కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రహరీని ఆనుకొని పేరుకున్న నిల్వలతో ఉడా కమ్యూనిటీ హాలులో ఫంక్షన్ల నిర్వహణ సమయంలో ఇబ్బంది ఎదురవుతోంది. కమ్యూనిటీ హాలు వంటశాలను ఆనుకొని పెద్ద ఎత్తున పోగుచేస్తున్న చెక్కలు, కట్టెల వ్యర్థాలతో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు శానిటరీ సెక్రటరీ తెలిపారు. దిగువ కాలువ ప్రవాహాల మీదుగా ఇదే దారిలో బడ్డీలు వరుసగా ఏర్పాటు కావడంతో వీటిని ఆనుకుని ఈ చెత్త గుట్టలుగా ఫంక్షన్ హాలు చుట్టూ పేరుకుపోతోంది. పైగా ప్రక్కనే ఆర్టీసీ బస్టాప్ కూడా ఉండటంతో ప్రమాదాల్ని అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నారు. దీనిపై అక్కడే ఉన్న చెక్కలు, కట్టెలను పోగు చేస్తున్న వారు స్థానిక వార్డు కార్పొరేటరుకు ఫోన్ చేసి, పనులకు ఒక దశలో ఆటంకం కల్గించినా, సెక్రటరీ తన విధుల్ని పూర్తి చేశారు. వాగ్వాదాలకు చోటివ్వకుండా వ్యర్థాల్ని చిన్న పొక్లయిన్‌తో జీవీఎంసీ వ్యానులో తరలించారు.

అంధుల ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆంధ్ర విజయం



విజేతల బృందం

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన తొలి అంధుల ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ పెనాల్టీ షూటౌట్స్‌లో ఒడిశాపై విజయం సాధించింది. నేత్ర విద్యాలయ గ్రౌండ్‌లో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ ఆకట్టుకుంది. మ్యాచ్ నిర్ణీత సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు చెరో గోల్ చేయడంతో డ్రా అయింది. దీంతో విజేతలను నిర్ణయించేందుకు రిఫరీ పెనాల్టీ షూటౌట్స్‌ను నిర్వహించారు. కెప్టెన్ సూర్య నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ఆటగాళ్లు షూటౌట్స్‌ను గోల్స్‌గా మలచడంలో విజయవంతం అయ్యారు. ఒడిశా ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో షూటౌట్స్‌ను గోల్స్‌గా మలచడంలో విఫలం కావడంతో ఓటమి తప్పలేదు. అంధుల ఫుట్‌బాల్‌ను ఆంధ్రాలో పరిచయం చేయడంలో కోచ్ శ్రుజన్ భూపతిరాజు విశేషంగా కృషి చేశారు. ఇండియన్ బ్లైండ్ ఫుట్‌బాల్ ఫెడరేషన్‌లో కీలక పాత్ర పోషిస్తున్న శ్రుజన్..నేత్ర విద్యాలయ నిర్వాహక బృందం సోమేష్, శిరీషా, ఉదయ్‌కిరణ్‌ల సహకారంతో అంధుల ఫుట్‌బాలర్లను తీర్చిదిద్దారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దుతూ అవసరమైన ప్రోత్సాహం అందించడంలో నేత్ర విద్యాలయ చూపుతున్న శ్రద్ధను పలువురు ప్రశంసించారు.

2026 నుంచి విశాఖకు విమానాలు బంద్

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. ఇవి మార్చితో పూర్తవుతాయని భావించారు. కానీ మట్టి స్వభావం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయి. ఆగస్టుకు కాని పూర్తికావని చెబుతున్నారు. ఈ పనులు జరుగుతున్నపుడు విమానాలు దిగడం కోసం ఉపయోగించే 'ఇనుస్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్(ఐఎల్ఎస్)'ను ఆపేస్తున్నారు. గత కొద్దికాలంగా రన్‌వే విస్తరణ పనులు జరుగుతుండడం వల్ల విమానాలతో ఐఎల్ఎస్ అనుసంధాన ప్రక్రియకు సాంకేతిక అవరోధాలు కలుగుతున్నాయి. రన్‌వే పనులు పూర్తయ్యేంత వరకు ఐఎల్ఎస్ సదుపాయం ఉండదని కూడా నేవీ అధికారులు ఈ సమావేశంలో స్పష్టం చేశారు. అదే విధంగా రన్‌వే పనులు త్వరితంగా పూర్తి చేయడానికి ఫిబ్రవరి నుంచి రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు విమానాల రాకపోకలను అనుమతించబోమని నేవీ అధికారులు వెల్లడించారు. విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ సర్వీసులు సింగపూర్, బ్యాంకాక్, కౌలాలంపూర్ నుంచి రాత్రి 11 గంటల తరువాతే వస్తున్నాయి. అవి రద్దు కాకుండా ఉండాలంటే... వాటి షెడ్యూళ్లు మార్చుకోవాలని, లేదంటే రాత్రి 12 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు రాకపోకలు నిలిపివేస్తామని నేవీ అధికారులు పేర్కొన్నారు.

15 స్లాట్ల పెంపునకు అంగీకారం

విశాఖ విమానాశ్రయం రన్‌వేను ప్రస్తుతం పౌర విమానాలకు, నేవీ విమానాలకు ఉపయోగిస్తున్నారు. పౌర విమానాలకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు గంటకు 12 స్లాట్లు మాత్రమే ఇస్తున్నారు. అంటే ఆరు విమానాలు వచ్చి, తిరిగి వెళ్లగలుగుతున్నాయి. దీనివల్ల కొత్త విమానాలు రావడానికి అవకాశం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో విశాఖ ఎంపీ శ్రీభరత్ స్లాట్ల సంఖ్యను 18కి పెంచాలని నేవీ అధికారులను కోరారు. అన్ని ఇవ్వలేమని 15 వరకూ మాత్రమే ఇస్తామని హామీ ఇచ్చారు.

దుబాయ్ విమానం పునరుద్ధరణపై దృష్టిపెట్టండి

... 5వ పేజీ తరువాయి

కొరత వల్ల ఇక్కడి సర్వీస్‌లు రద్దు చేసుకున్నాయన్నారు. వారితో మాట్లాడి సర్వీస్‌లు పునరుద్ధరణకు ప్రయత్నిస్తామని అధికారులు చెప్పారు. అంతర్జాతీయ సరకు రవాణాకు ఇంకా అడ్డంకులు తొలగలేదని, ఆ సమస్య పరిష్కారానికి త్వరగా చర్యలు చేపట్టాలని ఎంపీ శ్రీభరత్ ఆదేశించారు. బెంగళూరు, ముంబై నగరాలకు నడుస్తున్న విమానాలకు అత్యధిక డిమాండ్ ఉన్నందున సర్వీస్‌లు పెంచాలని పలువురు సభ్యులు సూచించారు. పౌర విమానాలకు ఆటంకం కలగకుండా చూడాలని ఐఎన్ఎస్ డేగా అధికారులను కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు.

కొత్త కమిటీ ఏర్పాటు

విశాఖ విమానాశ్రయం సలహా కమిటీకి పలువురు సభ్యులను నామినేట్ చేసే అధికారం ఎంపీకి ఉంది. ఆ కోటాలో పలు రంగాలకు చెందిన వారిని శ్రీభరత్ నామినేట్ చేసి, నియామకపు పత్రాలు సమావేశంలోనే అందజేశారు. రెండేళ్ల పదవీ కాలం ముగిసిన వారిని కొందరిని కమిటీ నుంచి తప్పించారు. దసపల్లా హోటల్ సీఈఓ వెంకటకృష్ణ, సింబయోసిస్ టెక్నాలజీస్ సీఈఓ ఓ.నరేశ్‌కుమార్, ఐటీ సంస్థ ఫ్లూయెంట్ గ్రిడ్ చైర్మన్ గన్నమనేని మురళీకృష్ణ, షోర్ ఫ్రంట్ రిసార్ట్ అధినేత సంజన, సీవీ ఇన్‌ఫ్రా డైరెక్టర్ సీవీ ప్రద్యుమ్న, రాధిక గ్రూపు ఇండస్ట్రీస్ అధినేత మన్వేందర్ మోర్, రామబ్రహ్మం అండ్ సన్స్ ప్రతినిధి కంచర్ల రామ్‌ప్రసాద్‌లను నియమించారు. వీరు విమానాశ్రయం అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషిచేయాలని భరత్ సూచించారు. ఈ కమిటీలో ప్రత్యామ్నాయ చైర్మన్‌గా విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, సిటీ పోలీస్ కమిషనర్ నామినేటెడ్ సభ్యులుగా ఉన్నారు.

మళ్లీ వైరస్ టెన్షన్

... 5వ పేజీ తరువాయి

ఫ్లూ మాదిరిగా వచ్చి తగ్గుతుందని పేర్కొంటున్నారు. బ్రాంకైటిస్, న్యుమోనియా, ఆస్తమా ఉన్న వారిలో తీవ్రత కొంత ఎక్కువగా ఉంటుందంటున్నారు. మాస్క్ ధరించడం, చేతులను శుభ్రం చేసుకోవడం కీలకమని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలని చెబుతున్నారు.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. జాగ్రత్తలు అవసరం

దేశంలో కూడా కేసులు నమోదైన నేపథ్యంలో కొంత అప్రమత్తంగా ఉండడం అవసరం. ఈ వైరస్ కూడా కరోనా జాతికి చెందినదే. ఇది అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా పిల్లల్లో, 65 ఏళ్లు దాటిన వారిలో దీని వ్యాప్తి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికిప్పుడు ఈ వైరస్ ప్రమాదకర స్థాయిలో వ్యాప్తి చెందే అవకాశం లేదు. ఏదైనా ఇబ్బందులు ఉంటే వైద్యుల సూచనల మేరకు నడుచుకోవాలి. పానిక్ కావద్దు. అనుమానాలు, భయాలను పెట్టుకోవద్దు.

- డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

ప్రధాని సభకు చకచకా ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఏడు వేల వాహనాలు వినియోగించనున్నారు. సభకు వచ్చే జనం కోసం మూడు లక్షల ఫుడ్‌ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి బహిరంగ సభకు వచ్చే వారి కోసం 1.1 లక్షల ప్యాకెట్లు బస్సులు/వాహనాలు బయలుదేరే పాయింట్లకు పంపుతారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చే వారికి నాతవలస టోల్‌గేట్ వద్ద 15 వేల ప్యాకెట్లు అందిస్తారు. అనకాపల్లి నుంచి వచ్చే వారికి 40 వేలు, విజయనగరం జిల్లా నుంచి వచ్చే వారికి 15 వేల ప్యాకెట్లు ఆయా జిల్లాల అధికారులు బస్సుల్లోనే అందించనున్నారు. సభ అనంతరం తిరిగి వెళ్లేప్పుడు పంపిణీ చేసే నిమిత్తం విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారికి 1.25 లక్షలు, విజయనగరం, అనకాపల్లి నుంచి వారికి 55 వేల ఆహార ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. ఇవి కాకుండా ప్రత్యామ్నాయంగా అనకాపల్లి నుంచి వచ్చే వారికి అగనంపూడి టోల్ గేటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చే వారికి రాజాపులోవ సమీపాన అవంతి కళాశాల, అడవివరం జంక్షన్ వద్ద అందించేందుకు 20 వేల స్నాక్స్ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. కాగా రోడ్ షోలో పాల్గొనే 70 వేల మందికి స్నాక్స్ పంపిణీ చేయాలని భావించారు. అయితే ప్రధాని భద్రతను పర్యవేక్షించే ఎస్పీజీ అధికారులు అనుమతి ఇవ్వనందున వాటి పంపిణీ రద్దు చేశారు.

ప్రధాన వేదిక వరకూ రోడ్‌షో

ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభా వేదిక వరకూ రోడ్‌షో నిర్వహించనున్నారు. దీనిపై ఇంతవరకూ అధికారికంగా స్పష్టత రాకపోయినా సోమవారం వేదిక ముందు ప్రాంగణం మధ్య నుంచి తారురోడ్డు వేశారు. దీనిని బట్టి రోడ్డు షో ఏయూ ఎకనామిక్స్ విభాగం ఎదురుగా గల వెంకటాద్రి వంటిల్లు వద్ద నుంచి ప్రారంభమై త్రీటౌన్ జంక్షన్, ఏయూ మహిళా మీదుగా వేదిక వరకూ సాగుతుందని భావిస్తున్నారు. వెంకటాద్రి వంటిల్లు నుంచి రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు నిర్మించారు. కాగా ప్రధాని పర్యటించే ప్రాంతంలో ఎస్పీజీ అధికారులు తనిఖీలు ముమ్మరంచేశారు.

ఐటీ కంపెనీలను జగనే తెచ్చారట!

... 5వ పేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. అలాగే భోగాపురంలో విమానాశ్రయం నిర్మాణానికి 2019లోనే సీఎంగా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ విమానాశ్రయాన్ని కూడా జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చినట్టు అమర్ చెప్పుకున్నారు.

అదేవిధంగా రుషికొండపై ప్యాలెస్‌ను జగన్ రూ.500 కోట్లతో సొంతం కోసం నిర్మించుకోలేదని అమర్ అడ్డగోలుగా మాట్లాడారు. నాటి సీఎం జగన్ తన నివాసం కోసం సముద్ర తీరాన ఆ ప్యాలెస్ నిర్మించారని అందరికీ తెలుసు. ఇప్పుడు దానిని ప్రధాని, రాష్ట్రపతి విడిది కోసం ఉపయోగించుకోవాలని అమర్ ఓ సలహా కూడా పారేశారు. ప్రధాని, రాష్ట్రపతి విశాఖపట్నం వస్తే కొన్ని గంటల్లోనే ఇక్కడి కార్యక్రమం చూసుకొని వెళ్లిపోతారు. అంత ఎందుకు బుధవారం ప్రధాని మోదీ విశాఖపట్నం వస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు దిగి తిరిగి రాత్రి 7 గంటలకు బయల్దేరి వెళ్లిపోతున్నారు. ఇలా మూడు, నాలుగు గంటలు ఉంటే వీవీఐపీల విడిది కోసం రూ.500 కోట్ల భవనం ఏడాది పొడవునా ఖాళీగా ఉంచాలా?...ఇదేనా ప్రజాధనం పట్ల బాధ్యత..? అని అమర్‌నాథ్ మాటలపై విశాఖ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

ఘనంగా సత్యసాయి పల్లకీ సేవ

అగనంపూడి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా శత జయంతిని పురస్కరించుకుని పెదమడకలో పల్లకీ సేవ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు సత్యసాయి సంకీర్తనలను ఆలపించారు. నిర్వాసిత కాలనీల మీదగా పల్లకీ సేవ సాగింది. కార్యక్రమంలో భజన మండలి ప్రతినిధులు విందుల రామకృష్ణ, పైడినాయుడు, బి. సత్యనారాయణ, కేఆర్‌కే రాజు, బీవీ సుబ్బారావు, వెంకటరమణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కూర్మన్నపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కష్టించే కార్యకర్తలకు టీడీపీలో సముచిత గౌరవం లభిస్తుందని, కష్ట కాలంలో కార్యకర్తలకు అండగా ఉంటుందని పార్టీ 70వ వార్డు అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు అన్నారు. 70వ వార్డు పరిధి శ్రీనివాస నగర్, ఎర్రగెడ్డ కాలనీల్లో సోమవారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదు కార్యకర్తతో పాటు కుటుంబానికి భరోసా, భద్రతగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డేడ రమణ, పీఎంఎల్ నాయుడు, రాజా, ఎంఎస్ఎన్ రాజు, కృష్ణ, రెహమాన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సాధన కోసం పెన్షనర్ల పోరుబాట

పెదగంట్యాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పోరుబాట పట్టాలని పారిశ్రామిక ప్రాంత పెన్షనర్ల అసోసియేషన్ తీర్మానించింది. ఇక్కడి సీడబ్ల్యూసీలో సోమవారం అసోసియేషన్ సమావేశాన్ని అధ్యక్షుడు కణితి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు కనీస పింఛన్‌ను రూ.తొమ్మిది వేలు చేయాలని, పెన్షనర్లతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. సమావేశంలో సీఐటీయూ స్టీల్‌ప్లాంట్ అధ్యక్షుడు వైటీ దాసు, అసోసియేషన్ సభ్యుడు భైరెడ్డి గురప్ప, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

తండ్రి నేత్రాలను దానం చేసిన తనయులు

పెందుర్తిరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మరణించిన తండ్రి నేత్రాలను కుమారులు దానం చేశారు. మండలంలోని చింతల అగ్రహారం గ్రామానికి చెందిన శెట్టి అప్పలకొండ (52) అనారోగ్యంతో సోమవారం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందారు. పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాసరావు సలహా మేరకు మృతుడి నేత్రాలను దానం చేయడానికి కుమారులు సత్యప్రసాద్, సంతోష్ ముందుకొచ్చారు. ఎల్వీ కంటి ఆస్పత్రి ప్రతినిధులు అప్పలకొండ నేత్రాలను సేకరించారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యువి:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 46, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 14, క్యాబేజీ 18, క్యారెట్ 46, దొండకాయలు 44, బంగాళదుంపలు 27, అరటికాయ (పెద్దది) 7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 50, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 60, కీరదోస 36, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 44, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, క్రర్రపెండలం 24, మామిడి అల్లం 64, బూడిద గుమ్మడికాయ 30, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనకు విచ్చేస్తున్నందున భారీగా స్వాగతం పలకాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటనను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామన్నారు. కోట్లాది రూపాయలతో చేపట్టే పలు ప్రాజెక్టులకు సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లతో కలిసి మోదీ శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్లాంట్ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ప్రధాని మోదీ పర్యటనతో ఉత్తరాంధ్ర రూపురేఖలే మారిపోతాయన్నారు. గడిచిన ఐదేళ్లు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీలో ఇంకా అహంకార భావన తగ్గలేదన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలందరూ అధిక సంఖ్యలో విచ్చేసి ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, దల్లి గోవిందరెడ్డి, నాయకులు పుచ్చా విజయ్‌కుమార్, అనంతలక్ష్మి, గడసాల అప్పారావు, పెంటారావు, గోమాడ వాసు, తదితరులు పాల్గొన్నారు.

హరిలో.. రంగ హరి..

నగర సంకీర్తనలు ఆలపిస్తున్న హరిదాసులు



కూర్మన్నపాలెంలో ద్విచక్ర వాహనంతో హరిదాసు

కూర్మన్నపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పల్లెలు పట్టణాలుగా మారుతున్నా.. నగరవాసుల జీవన శైలిలో మార్పులు చోటుచేసుకుంటున్నా ఇంకా కొన్ని సనాతన ఆచార సంప్రదాయాలు కొనసాగుతునే ఉన్నాయి. మహా నగరంలోని పలు ప్రాంతాల్లో సంక్రాంతి పండగకు చిహ్నంగా వేకువజామునే హరినామస్మరణతో పలువురు హరిదాసులు మేలుకొల్పులు పాడుకుంటూ ఇప్పటికీ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. అయితే కొంతమంది హరిదాసులు కాలాబాటన కీర్తనలు ఆలపిస్తూ పురవీధుల్లో సంచరిస్తుంటే, మరికొంతమంది వాహనాలను వినియోగిస్తుండడం విశేషం. ఈ క్రమంలో కూర్మన్నపాలెం పరిసర ప్రాంతాల్లో ఓ హరిదాసు ద్విచక్ర వాహనంపై సంచరిస్తూ పురవీధుల్లో మైకు ద్వారా కీర్తనలను ప్రజలకు వినిపిస్తుంటే.. ఆటోనగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మరో హరిదాసు ఏకంగా తోపుడుబండిని ఇందుకోసం వినియోగిస్తుండడం గమనార్హం. వారు ఎలా సంచారం చేస్తున్నారన్న విషయాన్ని పక్కన పెడితే సంక్రాంతి విశిష్టతను, మన సంస్కృతీ సంప్రదాయాలను మాత్రం ప్రజల్లోకి తీసుకువెళుతుండడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు సీనియర్ సిటిజన్లు అభిప్రాయ పడుతున్నారు. ధనుర్మాసానికి హరిదాసులు నిండుదనాన్ని తెస్తారని, హరిలో రంగహరి, శ్రీమద్రమా రమణ గోవిందో హరి...అనే



ఆటోనగర్‌లో తోపుడుబండితో..

పాటలను ప్రజలకు వినిపిస్తూ సంక్రాంతి సందడి తెస్తున్నారని పేర్కొంటున్నారు. దీంతో ప్రస్తుతం పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో వేకువజామున హరిదాసుల కీర్తనలు ప్రజలందరినీ మేల్కొలుపుతున్నాయి. అదేవిధంగా డూడూ బసవన్నల సందడి కూడా పలుచోట్ల కనిపిస్తుంది.





గూడ్స్ రైలు ఎయిర్ పైపును పరిశీలిస్తున్న చేస్తున్న దృశ్యం.. పక్కన బారులుతీరి నిలిచిన వాహనాలు

అరగంట పాటు గూడ్స్ రైలు నిలిపివేత: స్తంభించిన ట్రాఫిక్

కూర్మన్నపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ పరిధి వార్డు పకీరుతఖ్యా నుంచి కాపు జగ్గరాజు పేట రహదారి మధ్యలో ఉన్న రైల్వే గేటు వద్ద సోమవారం ఉదయం తొమ్మిదిన్నరప్పుడు సుమారు అరగంట పాటు గూడ్స్ రైలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. గూడ్స్ రైలుకు సంబంధించిన ఎయిర్ పైపు లీకవ్వడంతో దానిని నిలిపివేశారు. రైల్వే టీటీ అక్కడకు వచ్చి, పైపును సరిచేసి ఆ సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాక దువ్వాడ రైల్వే స్టేషన్ వైపు నెమ్మదిగా ఆ రైలు వెళ్లింది. రైల్వే గేటు మూసివేయడంతో కళాశాల విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.



ఆటోనగర్‌లో విరిగిన రైల్వే గేటు

ఆటోనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ చుక్కవానిపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సోమవారం సాయంత్రం రైల్వే గేటు విరిగిపోయింది. దీంతో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొంతమంది వెనుదిరిగి వడ్లపూడి వైపు మీదుగా గాజువాకకు వెళ్లారు. రైల్వే సిబ్బంది వచ్చి గేటును పరిశీలించారు. దీనికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడితే తప్ప వాహనాల రాకపోకలు జరగవని పలువురు వాహనదారులు చెబుతున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు

అగనంపూడి, జనవరి (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో సత్ప్రవర్తన, ఉజ్వల భవిష్యత్తుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి పతనానికి దారితీసే మాదకద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులంతా డ్రగ్స్‌ విని యోగానికి దూరంగా ఉంటూ బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుని కుటుంబాలకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ బీకే సోమేశ్వరి, ప్రిన్సిపాల్ సుధాకరబాబు, రామకోటి, బీసత్యనారాయణ, బిశ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞాన్'లో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు

దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆహారం, డైటెటిక్స్, పౌష్టికాహారం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆహార అలవాట్లు చేసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ మధుసూదనరావు, డీన్ సతీశ్, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనాలు ఢీకొని 2 జింకలు మృతి

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనాలు ఢీకొని రెండు జింకలు మృత్యువాత పడ్డాయి సోమవారం వేకువజాము మూడు గంటలకు జూ పార్కు ప్రాంతంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక జింక మృతి చెందగా, తెల్లవారుజామున ఐదు గంటలకు మారికవలస ప్రాంతంలోని మరో జింక మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు అటవీ శాఖాధికారులు సంఘటనా స్థలాలకు వెళ్లి వాటిని పరిశీలించారు. పోస్టుమార్టం చేశాక ఖననం చేశారు.



మారికవలస హైవేపై మృతి చెందిన జింక

రాష్ట్ర కబడ్డీ విజేతలుగా విశాఖ బాలబాలికలు



ట్రోఫీలతో విజేతలుగా నిలిచిన బాలబాలికలు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన ఎం.రంగారావు మెమోరియల్ 50వ అంతర్ జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీల్లో విశాఖ జట్లు విజేతలుగా నిలిచాయి. సోమవారం జరిగిన ఫైనల్స్ బాలికల విభాగంలో విశాఖ జట్టు కర్నూలుపై పది పాయింట్ల తేడాతో, బాలుర జట్టు కర్నూలు టీమ్‌పై 12 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి. విజేతలకు మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ బహుమతులు అందజేశారు.

రోడ్డు మీద రోడ్డు.. జీవీఎంసీ తీరు!

» రూ.లక్షల్లో ప్రధానం దుర్వినియోగం

మల్కాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 61వ వార్డు మల్కాపురం ప్రాంతంలో బాగున్న సీసీ రహదారులపైనే మళ్లీ రోడ్డు వేసి జీవీఎంసీ అధికారులు రూ.లక్షల్లో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. కొత్త రోడ్లు వేయాల్సిన ప్రాంతాలను కాదని మరీ బాగున్న పాత రోడ్డుమీదే రోడ్డు వేయడం దారుణమని స్థానికులు విమర్శిస్తున్నారు. మల్కాపురం నగరాల వీధిలో ప్రస్తుతం ఉన్న ఈ రోడ్డుమీద చిన్న గొయ్యి లేదు. ఎత్తుపల్లాలు కూడా లేవు, అయినప్పటికీ నిధులు ఖర్చుచేసి, బిల్లులు కొట్టేసేందుకు కొత్త రోడ్డు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి అన్ని ప్రాంతాల్లోనూ కనిపిస్తోందంటున్నారు. పైగా నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదు. కాంట్రాక్టర్‌తో కమీషన్ కోసం అధికారులే బలవంతంగా రోడ్లు వేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరుచేసిన జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి ఈ పనులు చేపడుతున్నారు. డాక్‌యార్డు సమీపంలో ఉన్న వంతెన మూసివేసిన నేపథ్యంలో ప్రజలు అధికంగా వినియోగిస్తున్న ములగాడ రహదారి దారుణంగా మారింది. రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ దానిని పట్టించుకోకుండా బాగున్న పాత సీసీ రోడ్లపై కొత్తగా రోడ్డు వేయడం అనుమానాలకు తావిస్తోంది.



మల్కాపురం నగరాల వీధిలో సుందరంగా ఉన్న సీసీ రోడ్డు



అదే రోడ్డుపై కొత్తగా వేసిన సీసీ రోడ్డు

ప్రధాని సభకు భారీగా జనసమీకరణ చేయాలి

» కూటమి నేతల సమావేశంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేదీన జరగనున్న ప్రధాని మోదీ రోడ్ షో, బహిరంగ సభకు పెందుర్తి నియోజకవర్గం నుంచి భారీగా జనాన్ని తరలించేలా కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. సుజాతనగర్‌లోని దాట్లమేన్షన్స్‌లో సోమవారం పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల కూటమి నేతలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. జనసమీకరణకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అధికారుల సమన్వయంతో కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సమావేశంలో జెడ్పీ హేమవతి, టీడీపీ నేతలు దాట్ల మధు బుచ్చిరాజు, బీజేపీ నేత గొర్లె రామునాయుడు, రెడ్డి నారాయణరావు, జనసేన నేతలు డీబీఎల్ నాయుడు, కంచిపాటి మధు, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

ఇంటక్ ప్యాకెట్ క్యాలెండర్ ఆవిష్కరణ

మల్కాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ గుర్తింపు యూనియన్ (ఇంటక్) ముద్రించిన ప్యాకెట్ క్యాలెండర్‌ను సీఎండీ హేమంత్ ఖత్రీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు యూనియన్ నాయకులు ముద్రించిన ఈ ప్యాకెట్ కాలెండర్‌లో పూర్తి సమాచారం పొందుపరిచారని అభినందించారు. గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులకు సాదర స్వాగతం





మంత్రులు నాదెండ్ల, సత్యకుమార్‌లకు స్వాగతం పలుకుతున్న జనసేన, బీజేపీ నేతలు

గోపాలపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పర్యటన నిమిత్తం సోమవారం నగరానికి వచ్చిన పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. జనసేన, బీజేపీ నేతలు వారికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. కాగా నాదెండ్ల మనోహర్ అనకాపల్లి, సత్యకుమార్ యాదవ్ నగరానికి వెళ్లారు.

విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యుడిగా రమేశ్‌కుమార్



బండి రమేశ్‌కుమార్

కూర్మన్నపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు గ్రీన్ సిటీకి చెందిన వైజాగ్ ప్రొఫైల్స్ సలహాదారుడు బండి రమేశ్‌కుమార్‌ను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యునిగా నియమిస్తూ ఏపీ ప్రభుత్వ పరిశ్రమల విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత విద్యుత్ వినియోగదారులకు క్షేత్ర స్థాయిలో మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తానన్నారు. రమేశ్‌కుమార్‌కు వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీరమాచనేని వెంకట కృష్ణారావు, కె.వెంకట రమణ, తదితరులు అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



ఉమ (ఫైల్ ఫొటో)

పెందుర్తి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురైన చికిత్స పొందుతున్న మహిళ సోమవారం మృతి చెందింది. దొగ్గవానిపాలెం సాయిదివ్యనగర్‌కు చెందిన అల్లుబోయిన ఉమ (41) గత నెల 27న మేడపైన పూల చెట్టుకు ఐరన్ రాడ్‌తో పువ్వులు కోసే యత్నంలో సమీపంలోని హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురైంది. ఆమెను నగరంలోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఏఐడీఈఎఫ్ కార్యదర్శి పర్యటన

ఎన్.ఎ.డి.జంక్షన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్, కేసుల బనాయింపుపై గత 46 రోజులుగా ఎన్ఏడీ కార్మికులు నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సి.కుమార్ మంగళవారం ఎన్ఏడీని సందర్శించనున్నారు. నిరసన తెలుపుతున్న కార్మిక కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. సీజీఎంను కలిసి సమస్యపై చర్చించనున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో విశాఖ రానున్న ప్రధాని మోదీకి వినతిపత్రం అందించేందుకు కార్మిక సంఘాలు సన్నద్ధమవుతున్నాయి.

అదుపుతప్పి దూసుకుపోయిన వ్యాన్



వేపగుంటలోని ఓ ఇంట్లోకి దూసుకుపోయిన వ్యాన్

వేపగుంట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పిన వ్యాన్ ఓ ఇంట్లోకి దూసుకుపోయింది. ఈ సంఘటన వేపగుంట బీసీకాలనీలో సోమవారం జరిగింది. భవన నిర్మాణ సామగ్రితో ఉదయం 11 గంటల సమయంలో వచ్చిన వ్యాన్‌ను ఇక్కడి కొండవాలు ప్రాంతంలో అన్‌లోడింగ్ చేసేందుకు ఆపారు. ఈ సందర్భంగా చక్రాల వెనుక రాళ్లు ఉంచారు. అయితే అవి జారిపోవడంతో వెనక్కి మళ్లి పి.సింహాద్రి ఇంట్లోకి దూసుకుపోయింది. దీంతో గోడకు పగుళ్లు వచ్చాయి. ఇంట్లోవారు బయటకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. ఓ మహిళ చేతికి గాయమయింది.

ముదపాక ల్యాండ్‌పూలింగ్ అక్రమాలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు



తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు అర్జీని అందిస్తున్న రైతులు

పెందుర్తి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ కోసం వైసీపీ ప్రభుత్వం ముదపాకలో చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో రెవెన్యూ అధికారులు మాయాజాలం చేశారని, ఇష్టం లేకున్నా బలవంతంగా భూసమీకరణ చేశారని పరిహారాన్ని అక్రమార్కులకు చెల్లించారని రైతులు ఆరోపించారు. దీనిపై కోర్టులో కేసులు నడుస్తున్నా తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపిస్తూ ముదపాక దళిత రైతులు రెవెన్యూ సదస్సులో అర్జీని అందించారు. మండలంలోని ముదపాకలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌కు బాధిత రైతులు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రైతులు నీలాపు రమణ, ముదపాక రాము, ముదపాక అప్పారావు విలేకరులతో మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్‌లో అప్పటి కలక్టర్ మల్లికార్జున, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, తహసీల్దార్లు శ్యాంప్రసాద్, ఆనంద్‌కుమార్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. గ్రామస్థులు కాని వారికి భూములున్నట్లు ఎల్‌పీవోసీ ఇచ్చారన్నారు. వివాదం కోర్టులో వున్నా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, వాస్తవ రైతులకు 900 గజాల ఎల్‌పీవోసీ పత్రాలు ఇవ్వకుండా తెలంగాణకు చెందిన అక్రమార్కుడికి కట్టబెట్టారన్నారు. కాగా ముదపాకలోని ల్యాండ్‌పూలింగ్ వివాదంపైనే సదస్సులో 158 అర్జీలు అందాయి, ఇతర సమస్యలపై 40 వచ్చాయి. ముదపాకలో వివాదం రేగుతోందనే సమాచారంతో సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ సారిపల్లి మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ముదపాక దేవి, పత్రి శివ, సారిపల్లి భీమేశ్వరరావు, గొలగాని సంతోశ్‌కుమార్, గొరపల్లి సత్యారావు, ముమ్వల రామకృష్ణ, గొలగాని చిన్నారావు, గొలగాని రాము పాల్గొన్నారు.

వింటేజ్ బైక్స్ C/o. రవి శంకర్‌రెడ్డి

పాత బైక్‌లపై వల్లమాలిన అభిమానం

ఆనాటి బైక్‌లపై నగరంలో సూపర్‌రైడ్




మోఫాపై రవిశంకర్

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): **అతనికి పాత తరం వస్తువులంటే ప్రాణం. వాటిని మూలన పడేయకుండా వినియోగంలో ఉంచడం మరీ ఇష్టం. తన తండ్రికి కూడా ఉన్న ఈ ఇష్టాన్ని కొనసాగిస్తూ వింటేజ్ బైకులకు తన ఇంటిని చిరునామాగా మార్చారు. ఇతని వద్ద ఒకటి రెండూ కాదు ఏకంగా 32 పాతతరం ద్విచక్ర వాహనాలున్నాయి. వాటిలో 28 కండిషన్‌లో ఉండగా, ఒక్కో దానిపై నగరంలో షికారు చేస్తుంటారు. నిర్వహణకు ఏటా రూ.2 లక్షలు ఖర్చవుతున్నా వెరవకుండా వాటిని కన్నబిడ్డలా సాకుతున్నారు రెడ్డికంచరపాలేనికి చెందిన బసవశంకరరెడ్డి.**

- తండ్రికి ఇచ్చిన మాట కోసం భద్రం చేస్తున్న వైనం
- నిర్వహణకు ఏటా రూ.2 లక్షల వరకు ఖర్చు
- అతని వద్ద ఇప్పటికే 32 వాహనాలు.. కండిషన్‌లో ఉన్నవి 28
- నాటి లాంబ్రెటా నుంచి నిన్నటి టీవీఎస్ 50 వరకు
- ఇంటినే పార్కింగ్ స్థలంగా మార్చి గుర్తింపు
- కండిషన్‌లో ఉంచేందుకు ప్రత్యేకంగా సమయం కేటాయింపు

ఏదైనా ఒక వాహనం కొనుగోలు చేస్తే పది, పదిహేనేళ్లు వినియోగిస్తాం. తరువాత మరమ్మతుల భారాన్ని భరించలేక విక్రయిస్తాం. అందరిలా చేస్తే ప్రత్యేకత ఏముంది అనుకున్నారో ఏమో బసవ శంకరరెడ్డి. ఏకంగా 60 ఏళ్ల కిందటి నుంచి కొనుగోలు చేసిన వాహనాలను భద్రపరుస్తున్నారు. వాటిని మూలనచేర్చి అప్పుడప్పుడు శుభ్రంచేసి వదిలేయడం కాదు. ఇప్పటికీ రన్నింగ్ కండిషన్‌లో ఉంచుతున్నారు. ఇందుకోసం ఏటా రూ.2 లక్షలు ఖర్చు చేస్తూ తన ఇంటిని వింటేజ్ బైకులకు అడ్డాగా మార్చుకున్నారు రెడ్డికంచరపాలేనికి చెందిన బసవ రవిశంకరరెడ్డి వద్ద ప్రస్తుతం 32 వింటేజ్ బైకులుండగా, వీటిలో నాలుగు మినహా అన్నీ కండిషన్‌లో ఉన్నవే. ఈ బైకుల మోడల్స్ ఎప్పుడెప్పుడు కొనుగోలు చేశారు.. నిర్వహణ ఇబ్బందులు, ఇంటికి చేరిన ప్రతి బైకును ఎందుకు భద్రపరుస్తున్నారో ఇలా చెప్పుకొచ్చారు.

తండ్రికిచ్చిన మాట మేరకు..

బసవ రవిశంకరరెడ్డి పాలిటెక్నిక్ చదివే సమయం నుంచి టెక్నికల్ అంశాలపై శ్రద్ధ చూపేవారు. ఎలక్ట్రికల్ వస్తువుల తయారీపైనా శ్రమించేవారు. తండ్రి అప్పల స్వామిరెడ్డి మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేయడం వల్ల అందులో ఆసక్తి పెరిగింది. తండ్రికి చిన్నప్పటి నుంచి బైకులు అంటే ఇష్టం. అప్పట్లో మార్కెట్‌లోకి వచ్చే ప్రతి బైకును కొనుగోలు చేసేవారు. అలా తొలిసారి 1957లో చెకోస్లోవాకియాకు చెందిన జావ్ 250 సీసీ బైకును కొనుగోలు చేశారు. 2011లో ఆయన మృతిచెందే సమయంలో శంకరరెడ్డికి ఓ మాట చెప్పారు. 'నువ్వున్నంత కాలం బైకులను అమ్మవద్దని, నిర్వహణను చూసుకోవాలి' అని. ఈ మేరకు అప్పటికే ఆయన కొనుగోలు చేసిన 28 బైకులను శంకరరెడ్డి జాగ్రత్తగా చూసుకుంటూ, మరో నాలుగు పాత బైకులను కొనుగోలు చేశారు.


ఎజ్‌డీ బైక్


ఎం 80

బైకుల కోసం భవనం..

సాధారణంగా బైకులను పార్కింగ్ ఏరియాలో ఉంచుతాం. కానీ ఇతని వద్ద అధికసంఖ్యలో ఉండడంతో ఏకంగా ఓ భవనాన్ని కేటాయించారు. వాహనాలన్నింటికీ కుటుంబసభ్యులుగానే చూసుకుంటారు. అప్పట్లోనే వీటికోసం రూ.లక్షల్లో వెచ్చించారని చెబుతున్నారు.

ప్రతి బైకుకూ ఓ ప్రత్యేకత..

రవిశంకర్‌రెడ్డి వద్ద ప్రస్తుతం 32 బైకులున్నాయి. వీటిలో 28 కండిషన్‌లో ఉన్నాయి. ఈయన రాజస్థాన్‌లో ని ఓ అమెరికన్ కంపెనీలో సీనియర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. మూడు వారాలకు ఒకసారి ఇంటికి వచ్చి ఇక్కడ మూడువారాలు ఉంటారు. ఒక్కోరోజు ఒకో బైకుతో షికారు చేస్తారు. బైకు కండిషన్ తెలుసుకునేందుకు రైడ్ తప్పనిసరి అంటారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరిస్తారు. ప్రస్తుతం 28 బైకులు కండిషన్‌లో ఉండగా.. ఒక్కో బైకుది ఒక్కో ప్రత్యేకతంటారు. ఆఫ్ రోడ్ కింగ్‌గా పేర్గాంచిన రాజ్‌దూత్‌ను 1980లో కొనుగోలు చేశారని, దీనిపై రైడ్ చేస్తే మస్త్ మజా అన్నారు. దీనిపై పొలాల్లో కూడా జెట్ స్పీడుతో దూసుకుపోవచ్చునని చెబుతారాయన. 1959లో మార్కెట్‌లోకి వచ్చిన మోడల్ లాంబ్రెటా 150 సీసీ నుంచి లేటెస్ట్ మోడల్ బైకులన్నింటినీ కొన్నారు. వీటిలో లాంబ్రెటా 175 సీసీ, లాంబ్రెటా 50 సీసీ, జావా 250 సీసీ, సువేగా మోపెడ్ 50 సీసీ, టీవీఎస్ మోపెడ్ 50 సీసీ, బజాజ్ ప్రియ 150 సీసీ, యమహా ఆర్ఎక్స్ 100, ఏఎక్స్ 100, సీడీ100, కేబీ100, డీజిల్ బుల్లెట్ 325 సీసీ, రాజ్ దూత్ బిగ్ 150 సీసీ, రాజ్‌దూత్ డీటీఎస్ 150 సీసీ, టూనా 50 సీసీ, హీరో హోండా స్ట్రీట్ 100 సీసీ, ఎన్‌ఫీల్డ్ సిల్వర్ ప్లస్ 50 సీసీ, బజాజ్ ఎం80 80 సీసీ, బజాజ్ సన్నీ 80 సీసీ, విజయ్ పుష్పక్ 150 సీసీ, కైనటిక్ హోండా జాయ్ 100 సీసీ, మోఫా (ఎన్‌ఫీల్డ్) 22 సీసీ, యెజ్డి క్లాసిక్ 250 సీసీ, ఇదే మోడల్‌లో మరోబైక్‌ను 1980లో తీసుకున్నారు. వీటితోపాటు ఎల్ఎంఎల్ వెస్పా 150 సీసీ, ఎల్ఎంఎల్ టీ ఫైవ్‌మోడల్ (తొలి ఇండియన్ సెల్ఫ్ స్టార్ స్కూటర్) ఈయన గ్యారేజీలో ఉన్నాయి.


ఈటీ, బజాజ్ సన్నీ

ఇల్లంతా బైకులే..

అతని ఇంట్లో ఎటు చూసినా బైకులే. వీటిలో మినీ బైకులు ఉన్నాయి. గోడలపైనా, ఇంటి మధ్యలో బైకులను అందంగా ఉంచారు. ఎలక్ట్రికల్, మెకానికల్ వస్తువుల తయారీపై ఇతనికి మక్కువ. ఇంట్లోని ప్రతి లైటు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో ఆపరేట్ చేసేలా డిజైన్ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి ఫ్యాన్లు, లైట్లను రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తారు. శబ్దాల ద్వారా ఆపరేట్ చేసేలా ప్రత్యేకమైన ఎలక్ట్రికల్ వ్యవస్థను డిజైన్ చేశారు.

నాన్న కోరికను ఇష్టంగా మార్చుకున్నా



నాన్నకు బైకులు ఇష్టం. తొలిసారి 1957లో ఇంటికి బైకు వచ్చింది. ఆ తరువాత మార్కెట్‌లోకి వచ్చే భిన్నమైన బైకులన్నీ చేరాయి. నేనై వింటేజ్ బైకులను కొనుగోలు చేశాను. ఇప్పటికీ మా ఇంట్లో ఓల్డ్ బైకులే ఉంటాయి. న్యూ మోడల్ తీసుకోలేదు. నాన్న చనిపోయే ముందు బైకులు అమ్మవద్దని చెప్పారు. షూటింగ్ చేయడానికి కొందరు అడిగారు. కానీ, ఇవ్వలేదు. ఎవరో హీరో వాడిన బైకు అని అనుకోకూడదు. నాదిగానే గుర్తింపుండాలి. కువైట్ నుంచి 2002లో యమహా ఆటో గేర్ బైక్ తీసుకురావడానికి ఎక్కువ ఖర్చుయింది. వీటితోపాటు పాతతరం బీరువాలు, ఇతర వస్తువులు ఉన్నాయి. పాత వస్తువులపై మమకారం పెరిగింది. కొనసాగిస్తున్నాను.

- బసవ రవిశంకర రెడ్డి, వింటేజ్ బైక్స్ యాజమాని

ప్రధాని పర్యటన రాష్ట్రాభివృద్ధికి దిక్సూచి

పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

సీతంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన రాష్ట్ర అభివృద్ధికి దిక్సూచి కానుందని ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 8న ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలన్నారు. పీఎంతోపాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రోడ్ షోలో పాల్గొంటారన్నారు. ప్రధానికి జనసేన తరపున ఘన స్వాగతం పలకడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ రూ.85 వేల కోట్ల పెట్టుబడితో 25 వేల మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాటవుతుందన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, లోకం మాధవి, సుందరపు విజయ్‌కుమార్, శివశంకర్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు బొలిశెట్టి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు



విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈనెల ఎనిమిదిన నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం నుంచి నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు సీపీ శంఖబ్రతబాగ్చి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానితోపాటు పలువురు ప్రముఖులు, వేలాదిమంది ప్రజలు సభకు హాజరవుతుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. సభ జరిగే ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం పరిసర ప్రాంతాలతోపాటు రోడ్‌షో జరిగే మార్గంలో సాధారణ వాహనాల రాకపోకలను నిషేదించారు. మద్దిలపాలెం ఏయూ ఆర్చ్ నుంచి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ జంక్షన్ రోడ్డు, పెదవాల్తేరు కరకచెట్టుపోలమాంబ ఆలయం నుంచి సిరిపురం ద్రోణంరాజు సర్కిల్ వరకు వాహనాలను అనుమతించమన్నారు.

- రోడ్‌షో జరిగే వెంకటాద్రివంటిల్లు నుంచి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ జంక్షన్ వరకు ఎడమవైపు రోడ్డును వీఐపీలకు, కుడివైపు రోడ్డును కాలినడకన వచ్చే ప్రజలకు కేటాయించారు.
- ప్రధాని సభ, రోడ్‌షోకు తూర్పు నియోజకవర్గం నుంచి 60 బస్సులు, రెండు వేల ఆటోలు వస్తాయని, అవి జోడుగుళ్లపాలెం మీదుగా పార్క్‌హోటల్ జంక్షన్ వద్ద కుడివైపు తిరిగి ఏయూ జిమ్నాజియం గేట్ మీదుగా ఏయూ సౌత్‌క్యాంపస్‌లోకి ప్రవేశించి శ్రీకృష్ణదేవరాయ హాస్టల్ వద్ద జనాలను దింపాలన్నారు. తర్వాత ఏయూ ఫుట్‌బాల్ మైదానంలో పార్కింగ్ చేయాలి.
- దక్షిణ నియోజకవర్గం నుంచి 2,200 ఆటోలు బీచ్‌రోడ్డు లేదా ఆర్టీసీ కాంప్లెక్స్, సెవెన్‌హిల్స్ ఆస్పత్రి మీదుగా సీఆర్‌రెడ్డి జంక్షన్‌కు చేరుకుని, అక్కడ జనాలను దింపి ఏయూ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లేదా దసపల్లా హిల్స్‌లో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.
- ఉత్తర నియోజకవర్గం నుంచి వచ్చే 2,500 ఆటోలు అక్కయ్యపాలెం, డైమండ్‌పార్క్, సంగంశరత్, గొల్లలపాలెం మీదుగా సీఆర్ రెడ్డి సర్కిల్‌కు చేరుకుని జనాలను దింపి, ఎంజీఎం గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి.
- పశ్చిమ నియోజకవర్గం నుంచి వచ్చే 182 మినీ బస్సులు, 1,250 ఆటోలు జ్ఞానాపురం, కాన్వెంట్ జంక్షన్, ఫిషింగ్‌హార్బర్, కోస్టల్‌బ్యాటరీ, ఎన్‌టీఆర్ జంక్షన్ మీదుగా ఆల్‌ఇండియా రేడియో మీదుగా కలెక్టర్ క్యాంపు కార్యాలయం రోడ్డులో ఏయూ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జనాలను దింపాలి. ఏపీఐఐసీ గ్రౌండ్‌కు చేరుకుని వాహనాలను పార్కింగ్ చేయాలి.
- ద్విచక్రవాహనాలపై సభకు వచ్చేవారంతా సిరిపురం వీఎంఆర్‌డీఏ మల్టీలెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్‌లో పార్క్ చేసుకోవాలి.
- వీవీఐపీ వాహనాలను ద్రోణంరాజు సర్కిల్, రూరల్ ఎస్పీ బంగ్లా మీదుగా హెలీప్యాడ్ గ్రౌండ్‌కు చేరుకుని పార్కింగ్ చేయాలి.
- వీఐపీ వాహనాలను నోవాటెల్, సర్క్యూట్‌హౌస్, సెవెన్‌హిల్స్ ఆస్పత్రి మీదుగా గొల్లలపాలెం జంక్షన్, స్వర్ణభారతి స్టేడియం, బీఆర్‌టీఎస్‌రోడ్డు, ఏయూ ఆర్చ్ నుంచి ప్రవేశించి సభావేదిక సమీపంలోని భాస్కరబాయ్స్ హాస్టల్ గ్రౌండ్‌లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.
- పోలీస్, రెవెన్యూ, జీవీఎంసీ అధికారుల వాహనాలను హెలీప్యాడ్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న మెరైన్ గ్రౌండ్‌లో పార్క్ చేయాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి వచ్చే 600 బస్సులు మారికవలస వద్ద ఎడమవైపు తిరిగి తిమ్మాపు రం మీదుగా కురుపాం జంక్షన్‌కు చేరుకుని అక్కడి నుంచి పోలమాంబ గుడి మీదుగా ఏయూ ఇంజనీరింగ్‌కాలేజీ సమతాహాస్టల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి.
- ఆనందపురం, భీమిలి, పద్మనాభం వైపు నుంచి వచ్చే వాహనాలు మారికవలస, తిమ్మాపురం, రుషికొండ, జోడుగుళ్లపాలెం మీదుగా కురుపాం జంక్షన్‌కు చేరుకుని విశాఖ ఐ హాస్పిటల్ మీదుగా ఏయూ ఇంజనీరింగ్‌కాలేజీ పార్కింగ్ ప్లేస్-1 వద్ద పార్కింగ్ చేసుకోవాలి.
- పెందుర్తి నియోజకవర్గం నుంచి వచ్చే వాహనాలను అడవివరం, హనుమంతవాక జంక్షన్, ఎంవీపీ డబుల్‌రోడ్డు మీదుగా విష్ణుహోండా జంక్షన్ రోడ్డులో పిఠాపురం కాలనీ రోడ్డు నుంచి ఏయూ ఇంజనీరింగ్ హాస్టల్ గ్రౌండ్-2కి చేరుకుని పార్కింగ్ చేసుకోవాలి.
- పరవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు ఎన్ఏడీ, గురుద్వారా జంక్షన్ మీదుగా మద్దిలపాలెం బస్‌స్టేషన్‌లోపలకు చేరుకుని, డిపోలో పార్కింగ్ చేసుకోవాలి.
- ప్రధాని మోదీ సభ సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఆరు నుంచి రాత్రి పది గంటల వరకు రద్దీగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు ప్రత్యమ్నాయమార్గాల్లో ప్రయాణించడం మంచిది.
- బుధవారం ఉదయం ఆరు నుంచి రాత్రి పదిగంటలు వరకు శ్రీకాకుళం, విజయనగరం నుంచి విశాఖ మీదుగా అనకాపల్లివైపు వెళ్లే అన్నిరకాల భారీ వాహనాలు ఆనందపురం, పెందుర్తి మీదుగా అనకాపల్లి వైపు మళ్లిస్తారు.
- సభ జరిగే బుధవారం ఉదయం ఆరు నుంచి రాత్రి పది గంటల వరకు మద్దిలపాలెం, ఏయూ పరిసరప్రాంతాలైన పెదవాల్తేరు కురుపాం సర్కిల్ నుంచి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వరకు, స్వర్ణభారతి స్టేడియం నుంచి మద్దిలపాలెం వైపు, మద్దిలపాలెం నుంచి పిఠాపురంకాలనీ, మంగాపురం కాలనీ వైపు వాహనాలకు అనుమతి ఉండదు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాల్సివస్తే ప్రత్యామ్నాయమార్గాలను ఎంపిక చేసుకోవాలి.

ప్రధాని పర్యటన విజయవంతానికి కృషిచేయాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


సర్క్యూట్ హౌస్‌లో సమావేశమైన మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నె 8న ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేసేందుకు కూటమి నేతలు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కూటమి నాయకులతో సోమవారం సాయంత్రం సర్క్యూట్‌హౌస్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రధానిమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రోడ్‌షోతోపాటు సభ నిర్వహణపై చర్చించారు. రోడ్‌షోకు అధిక సంఖ్యలో జనాలు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతా లోపాలు తలెత్తకుండా, ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సుమారు మూడు లక్షల మంది సభకు హాజరయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. నేతల మధ్య సమన్వయ లోపం లేకుండా ఐదు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రధానికి ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికేందుకు, రోడ్ షో, సభకు ఆహ్వానం, వీడ్కోలు పలికేందుకు ఒక్కో కమిటీ పనిచేస్తాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రధాని సభను విజయంతం చేయడం ద్వారా ఉత్తరాంధ్ర వైభవాన్ని చాటి చెబుదామన్నారు. సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీలు సీఎం రమేష్, శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్‌రాజు, నల్లమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు రుషికొండ భవనాన్ని వినియోగించాలి

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రుషికొండపై నిర్మించిన ప్యాలెస్‌ను ప్రధానమంత్రి, రాష్ట్రపతి నగరానికి వచ్చినపుడు వినియోగించుకోవాలని మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ ఈనెల ఎనిమిదిన శంకుస్థాపన చేయనున్న ప్రాజెక్టులన్నీ వైసీపీ హయాంలో వచ్చినవేనన్నారు. సకలశాఖలమంత్రిగా లోకేశ్ తయారయ్యారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై టీడీపీ నేతలతో బహిరంగచర్చకు తాను సిద్ధమని సవాల్ చేశారు. ఇన్ఫోసిస్ తమ హయాంలోనే వచ్చిందని, టీసీఎస్‌ను తామే తెచ్చామన్నారు. విశాఖలో ఐటీ పరిశ్రమ రావడానికి జగనే కారణమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రధానితో చెప్పించగలరా? అని ప్రశ్నించారు. కేంద్ర కారాగారంలో గంజాయి మొక్కలు పెంచుతున్నారని ఎద్దేవా చేశారు. రోజుకో మంత్రి బాగోతం బయటపడుతోందన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై ప్రధానితో ప్రకటన చేయించాలి

కూటమి నేతలకు సీపీఎం ఫ్లోర్‌లీడర్ గంగారావు లేఖ

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణతోపాటు పరిరక్షణ చర్యలపై ప్రధాని నరేంద్రమోదీతో ప్రకటన చేయించే బాధ్యత తీసుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు సీపీఎం ఫ్లోర్‌లీడర్ బి.గంగారావు సోమవారం లేఖ రాశారు. నెలలుగా జీతాలు చెల్లించకపోవడం, అగ్నిమాపక సర్వీసుల విభాగం ప్రైవేటీకరణ నష్టం చేసేవేనని ఆందోళన వ్యక్తంచేశారు. ఈనెల ఎనిమిదిన నగరానికి వస్తున్న ప్రధానిని కలిసి సమస్యలు విన్నవించేందుకు ఉక్కుపరిరక్షణ పోరాటకమిటీ ప్రతినిధులకు అపాయింట్‌మెంట్ ఇప్పించడంతోపాటు స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం, సొంత గనుల కేటాయింపు, క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ కింద రూ.20 వేల కోట్లు మంజూరు, అప్పులపై మారిటోరియంపై ప్రధానితో ప్రకటన చేయించే బాధ్యతను కూటమి నేతలు తీసుకోవాలని కోరారు.

అప్పన్నకు హుండీల ఆదాయం రూ. 1.94 కోట్లు


ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సేవకులు

సింహాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ఆలయ హుండీల లెక్కింపు సోమవారం నిర్వహించారు. గత 28 రోజులకు గాను రూ. 1.94 కోట్ల ఆదాయం స్వామివారి ఖజా నాకు చేరింది. నగదు రూపంలో రూ.1,94,40,202. బంగారం 46 గ్రాములు, వెండి 9.53 కిలోలు రాగా 12 దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ నోట్లు కూడా కానుకల రూపంలో వచ్చాయని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సేవకులు పాల్గొన్నారు.

ప్రయత్నం, ఫలితాల మధ్య అసమతుల్యతతోనే ఒత్తిడి

ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్



మాట్లాడుతున్న యండమూరి

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రయత్నం ఫలితాల మధ్య అసమతుల్యత వల్లే వ్యాపారంలో ఒత్తిడి వస్తుందని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. ఆరోగ్యం, కుటుంబ జీవితాన్ని సమతుల్యం చేస్తూ వ్యాపారంలో ఒత్తిడిని ఎదుర్కొనే అంశంపై క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ సోమవారం నగరంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. స్పష్టమైన ఉత్పాదకత, ఆర్థిక సమస్యలు, బకాయిలు వసూలు చేయలేకపోవడం, వంటివి చాలామందికి ఎదురయ్యే సాధారణ సవాళ్లన్నారు. పనితోపాటు ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని సూచించారు. నవ్వుతో రోజును ప్రారంభించండి అని సలహా ఇచ్చారు. సమయ నిర్వహణ, సృజనాత్మకతతో సవాళ్లను ఎదుర్కోవాలన్నారు.

పోలీసులపై తిరగబడిన నలుగురికి రెండేళ్ల జైలు

కూర్మన్నపాలెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలోని పోలీసులపై దాడి చేసిన నలుగురికి రెండేళ్ల జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మాడిశ గణేష్, దేవర గిరి, గొంప శివప్రసాద్, ఏదురు వెంకటేశ్ మద్యం సేవించి, 2018లో దువ్వాడ పోలీసులపై దాడిచేశారు. ఈ కేసును అప్పటి సీఐ కిశోర్‌కుమార్, ఎస్ఐ అప్పలనాయుడు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో సోమవారం గాజువాక అడిషినల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానాను విధించింది.